

08 పేజీలు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
సోమవారం | 06 నవంబర్ 2023 | www.navatelangana.com

మత్తు...చిత్తు

- మత్తులో యువత
- కౌన్సెలింగ్ కేసులు నమోదైనా మారని వైనం



6లో...

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు 15 మంది బాలికల జట్టు ఎంపిక

3లో...



ఢిల్లీకి గులామవుదామా..?



- రానున్నది ప్రాంతీయ పార్టీల యుగం
- తుమ్మలకు ఓటేస్తే తుమ్మముళ్లలో పడవేస్తాడు
- పువ్వాడకు ఓటేస్తే పువ్వుల్లో పెట్టుకొని చూస్తాడు
- బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గం ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్

'ఢిల్లీ గులాముల కింద ఉండే పార్టీకి ఓటేసి గులాం అవుదామా..? రాబోయేది ప్రాంతీయ పార్టీల యుగం.. ఎక్కడోళ్లు అక్కడ పాలించుకుంటేనే ఉత్తమం' అని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గం అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక ఎస్ఆర్బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో మాటలకు పరిమితి ఉంది అన్నారు. ఓ అర్భకుడు బీఆర్ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటు తాకనీయా? అంటున్నాడు.. ఖమ్మం ఆయన కొనేశాడా? అని ప్రశ్నించారు. ఒకాయన నేను మంత్రి పదవి ఇచ్చానంటే.. ఆయనే నాకు మంత్రి పదవి ఇచ్చాను అంటున్నాడు.. ఎవరికి ఎవరు మంత్రి పదవి ఇచ్చారో మీకు తెలియదా? అని ప్రశ్నించారు. పువ్వాడను గెలిపిస్తే పువ్వుల్లో పెట్టుకొని చూసుకుంటాడు.. తుమ్మలకు ఓటు వేస్తే తుమ్మముళ్ల పాలుజేస్తాడన్నారు.

వివరాలు మెయిన్‌లో..



సింగరేణి తెలంగాణ సొత్తు

- కాంగ్రెస్ నాయకుల వల్లే కేంద్రానికి వాటా
- ప్రజలు పరిణతితో ఓటు వేయాలి
- సీతారామ ప్రాజెక్టుతో జిల్లా బంగారు తునక అవుతుంది
- కొత్తగూడెం ప్రజాఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ-కొత్తగూడెం

నల్ల బంగారమైన సింగరేణి తెలంగాణ సొత్తును, చేతకాని కాంగ్రెస్ నాయకుల కారణంగా కేంద్రానికి 49 శాతం వాటా ఇవ్వాల్సి వచ్చిందని, ప్రజల ప్రజాస్వామ్యం పట్ల పరిణితి చెంది ఓటు వేయాలని, సీతారామ ప్రాజెక్టు పూర్తి అయితే జిల్లా బంగారు తునక అవుతపుందని సీఎం కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ కొత్తగూడెం అభ్యర్థి నవమా వెంకటేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ ఆదివారం కొత్తగూడెం సింగరేణి ప్రకాశం మైదానంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. భద్రాద్రి సీతారామ చంద్ర స్వామి కొలువు తీరిన పావన పవిత్ర భూమికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా... ఈ జిల్లాకు భద్రాద్రి జిల్లా అని పెట్టుకున్నామని అంటూ ప్రసంగం ప్రారంభించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడచినా భారతదేశంలో

మిగతా 3లో...

సీపీఐ(ఎం) అభ్యర్థులు వీరే

ప్రకటించిన రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

- పాలేరు బరిలో తమ్మినేని పోటీ
- పార్టీ శ్రేణుల్లో జోష్
- ప్రచారానికి సన్నద్ధం

ఉమ్మడి ఖమ్మం జిల్లా అసెంబ్లీ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) పోటీ చేయనున్న స్థానాలకు అభ్యర్థులను పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ప్రకటించారు. ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, వైరా, మధిర, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్లు ఇటీవల ప్రకటించిన విషయం విధితమే. కాగా ఆదివారం అభ్యర్థులను ప్రకటించడంతో పార్టీ శ్రేణులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. పాలేరు బరిలో తమ్మినేని వీరబ్రదం పోటీ చేస్తున్నారు.

మిగతా 4, 5లో...

ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం.

- బిఆర్ఎస్ సమాధి, కాంగ్రెస్ పార్టీ గెలుపుకు పునాది
- ఎన్నికల ప్రచార సభలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ-ముదిగొండ

కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సిఎల్పీ నేత,మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రెండో రోజు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మండలపరిధిలో మల్లన్నపాలెం పమ్మి, చిరుమర్రి, సువర్ణాపురం, ముదిగొండ వెంకటాపురం, గోకినేపల్లి గ్రామాల్లో ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారంలోకి రావడానికి ప్రజలకు మాయమాటలు చెప్పి, అనేక వాగ్దానాలు చేసిన కేసీఆర్, ఆయన కుటుంబం, బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల సంపదను దోపిడీ చేసి, రాష్ట్ర ఖజానాను లూటీ చేశారన్నారు. తెలంగాణ వచ్చి పది సంవత్సరాలు అవుతున్న ప్రజల జీవితాల్లో వెలుగులు రాలేదన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పరిశ్రమలు,ప్రాజెక్టులు ప్రజల జీవన భృతి,నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకపోవడానికి బిఆర్ఎస్ ప్రభుత్వం

మిగతా 3లో...

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఖమ్మం
సోమవారం | నవంబర్ 06 2023 | www.navatelangana.com

అవకాశవాద డబ్బు రాజకీయాలను తిప్పికొట్టాలి

- సమస్యలపై సమగ్ర అవగాహన కలిగిన నాయకులను చట్టసభలకు పంపించాలి
- 9న పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం నామినేషన్‌ను జయప్రదం చేయండి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్

నవతెలంగాణ-నేలకొండపల్లి



ఈనెల 30న జరగనున్న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో అవకాశవాద డబ్బు రాజకీయాలను తిప్పి కొట్టి, స్వచ్ఛమైన రాజకీయాలను స్వాగతించేలా సీపీఐ(ఎం) పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమ్మినేని వీరభద్రం సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ పిలుపునిచ్చారు. ఈనెల తొమ్మిదిన తమ్మినేని వీరభద్రం నామినేషన్ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మండల వ్యాప్తంగా ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలేరులో అధికార మదం, డబ్బు అహంకారం, స్వచ్ఛమైన నీతివంతమైన రాజకీయాల మధ్య పోటీ జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టు పట్టించేలా పాలక కొన్ని ప్రతిపక్ష పార్టీలు ప్రజలను సైతం తమ అధికార మదం, అహంకార డబ్బు రాజకీయాలతో కలుషితం చేస్తూ పక్కదారి పట్టించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ప్రజలు స్వేచ్ఛగా, స్వచ్ఛమైన, నీతివంతమైన వ్యవస్థను ఎంపిక చేయడంలో పాలక ప్రతిపక్ష పార్టీలు అనుసరిస్తున్న విధానాలు తీవ్ర అవరోధంగా మారాయన్నారు. ప్రజలు ప్రస్తుత రాజకీయ సమీకరణలు, మార్పులను నిశితంగా పరిశీలిస్తూ భావి భవిష్యత్తును నిర్దేశించడంలో చైతన్యవంతంగా వ్యవహరిస్తూ ఓటు అనే ఆయుధంతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సారథ్యంలో జిల్లా వ్యాప్తంగా పాదయాత్ర చేసి అనేక ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి వాటి పరిష్కారం కోసం నిరంతరం సిపిఐ(ఎం) ఉద్యమించిందని తెలిపారు. దళితవాడలు, గిరిజన తండాలు బాగుపడాలని వారంతా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని డిమాండ్ చేస్తూ తమ్మినేని వీరభద్రం సారథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేసి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సాధించిందన్నారు. ప్రజా సమస్యల పట్ల సమగ్రమైన అవగాహన కలిగి, జిల్లా రూపురేఖలను మార్చగలిగే దమ్ము, ధైర్యం ఉన్న, స్వచ్ఛమైన వ్యక్తిత్వం, పోరాట పటిమ, నిబద్ధత కలిగిన సిపిఐ(ఎం) నాయకులను చట్టసభలకు పంపడం ద్వారానే పేదల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. అనునిత్యం పేదల వెన్నంటే ఉంటూ వాటి పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న ప్రజా గొంతుకలు సిపిఐ(ఎం) నాయకుల ద్వారా చట్టసభలలో ప్రజావాణి వినిపించేందుకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కెవి.రామిరెడ్డి, నాయకులు రచ్చ నరసింహారావు, ఏటుకూరి రామారావు, పగటికత్తుల నాగేశ్వరరావు, రాసాల కనకయ్య, దుగ్గి వెంకటేశ్వర్లు, బెల్లం లక్ష్మి, సిరికొండ ఉమామహేశ్వరి, కట్టెకోల వెంకన్న, మారుతి కొండలరావు, భూక్య కృష్ణ, బండి రామమూర్తి, డేగల వెంకటేశ్వరరావు, మందడపు మురళీకృష్ణ, ఇంటూరి అశోక్, ఎడ్ల తిరుపతిరావు, ఎరదేశి నరసింహారావు, శీలం అప్పారావు, పెద్దిరాజు నరసయ్య, రాసాల నవీన్, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్ల అభివృద్ధిని ఐదేళ్లలో చేశా : పువ్వాడ

నవతెలంగాణ-ఖమ్మం



50 ఏళ్ల అభివృద్ధిని 5 ఏళ్లలో చేశానని బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గం అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఖమ్మంలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు రాజ్యాధికారం కల్పించామని తెలిపారు. ఐటీ హబ్, నూతన కలెక్టరేట్, కార్పొరేషన్ కార్యాలయం, మెడికల్ కళాశాల, నూతన బస్టాండ్, వైకుంఠ ధామాలు, రోడ్లు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ లు, వాకింగ్ ట్రాక్ లు, పబ్లిక్ టాయిలెట్లు, గోళ్లపాడు చానల్ ఆధునికీకరణ, పార్కులు ఇలా ఎన్నడూ చూడని అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఒకటా రెండా గతంలో గొంగళి పురుగులా ఉంటే కేసీఆర్ పుణ్యమా అని సీతాకోకచిలుకలా ఖమ్మాన్ని తీర్చిదిద్దామన్నారు. మైనార్టీల సంక్షేమానికి, అభివృద్ధికి ఎంతో పాటుపడినట్లు తెలిపారు. ఇప్పుడు ఖమ్మంలో కాంగ్రెస్ తరపున నిలబడి నాయన ఉన్నప్పుడు 21వేల నల్లా కనెక్షన్లు ఉంటే ఇప్పుడు 70 వేలకు చేరాయన్నారు. మున్నేరు ముంపుపై కేసీఆర్ కు మరో పెట్టుకుంటే రూ.690 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒకప్పుడు ఎన్టీఆర్, తర్వాత చంద్రబాబు నాయుడు, ఇప్పుడు కేసీఆర్ లను మోసం చేసినాయన.. నా చేతిలో ఓడినాయన..ఇప్పుడు తగరునమ్మా అని 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న ఆయన తనపై అవాకులు చవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-చింతకాని

మండల పరిధిలోని రామకృష్ణాపురం క్రాస్ రోడ్డు వద్ద గత బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాల పాలైన సంఘటన తెలిసినదే. ఈ సంఘటనలో చింతకాని గ్రామానికి చెందిన కైలాసపు వెంకటేశ్వర్లు(27) చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఎస్సై రాజేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంచలనం సృష్టిస్తోన్న రాయల్ ఓక్

ఖమ్మంలో భారీ పండుగ అమ్మకాలు

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



గొప్ప సంస్కృతి, వారసత్వం, సంప్రదాయాలకు నిలయంగా ఉన్న ఖమ్మం, ఇప్పుడు భారతదేశంలోని ప్రముఖ ఫర్నిచర్ బ్రాండ్ అయిన రాయల్ ఓక్ కు నిలయంగా ఉందని ఖమ్మం స్టోర్ మేనేజర్ రామకృష్ణ, తెలంగాణ రాష్ట్రం ఏరియా మేనేజర్ మహేష్ ఆదివారం తెలిపారు. రాయల్ ఓక్ ఖమ్మం ఈ ప్రాంతంలో అత్యుత్తమ నాణ్యత గల ఫర్నిచర్‌కు చిరునామాగా మారింది. నూతన ప్రమాణాలను నెలకొల్పింది. నగరంలో తనదైన ముద్ర వేసింది. 21,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న రాయల్ ఓక్, ఈ ప్రాంతంలో అతిపెద్ద ఫర్నిచర్ షోరూమ్‌గా నిలుస్తుంది. అమెరికా, ఇటలీ, మలేషియా, భారతదేశం నుండి ప్రీమియం ఫర్నిచర్ ఎంపిక అవకాశాలను ప్రదర్శిస్తుంది. మార్కెట్‌లో అత్యంత సరసమైన ధరలకు అందిస్తుంది. విభిన్న బడ్జెట్‌లకు తగినట్లుగా ఈ స్టోర్ ఆకట్టుకునే ఉత్పత్తుల శ్రేణిని అందిస్తుంది. వీటిలో :

- రిలాక్సేషన్, సౌకర్యం, శైలి కోసం, సాటిలేని ధర రూ. 15,000 నుండి రిక్లైనర్లను అందిస్తున్నారు.
- విలాసవంతమైన, సొగసైన బెడ్స్ కేవలం రూ.19,000 నుండి అందుబాటులో ఉన్నాయి
- అద్భుతమైన డైనింగ్ సెట్‌లు, విశేషమైన రీతిలో రూ. 14,000 నుండి ప్రారంభమవుతాయి.

అంతేకాకుండా, ఈ స్టోర్ అద్భుతమైన కుండీలు, వాల్ ఆర్ట్స్, గడియారాలు, అద్దాలు మరియు మరెన్నింటితో సహా విస్తృతమైన గృహాలంకరణ వస్తువులను అందజేస్తుంది. కార్పొరేట్ బహుమతి పరిష్కారాలతో సహా విలక్షణమైన మరియు ఆలోచనాత్మకమైన బహుమతి ఎంపికల కోసం ఇది ఒక గమ్యస్థానంగా మారుతుంది. పండుగ ఉత్సాహం మధ్య తమ అద్భుతమైన గ్రేట్ ఫెస్టివ్ సేల్‌ను ప్రకటించడం పట్ల సంతోషంగా ఉంది, వినియోగదారులకు విస్తృత శ్రేణి ఉత్పత్తులపై 70% వరకు తగ్గింపును పొందే అవకాశాన్ని అందిస్తోంది. ఖమ్మం రాపర్తి నగర్‌లో గల షాపును ప్రత్యక్షంగా తిలకించవచ్చని తెలిపారు.

ఇందిరమ్మ రాజ్యం కోసం ప్రతి గుండె పరితపిస్తుంది

- తెలంగాణలో అరాచక పాలన అంతానికి సమయం ఆసన్నమైంది
- తెలంగాణలో వచ్చేది ఇందిరమ్మ రాజ్యం
- బూత్ కమిటీ సమావేశంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెచ్చేందుకు తెలంగాణ ప్రతిబిడ్డ గుండె పరితపిస్తుందని, తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కేసీఆర్ అరాచక పాలన అంతానికి సమయం ఆసన్నమైందని మాజీ పార్లమెంట్ సభ్యులు, కాంగ్రెస్ పాలేరు నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిరుమలాయపాలెం మండల పరిధిలోని మాదిరిపురం స్టేజిలో జరిగిన బూత్ కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రతి బిడ్డ గుండె పరితపిస్తుందని అన్నారు. ప్రతి బూత్ సభ్యులు సమయం తక్కువ ఉండటంతో ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని మోసం చేసి రాష్ట్రంలో కొనసాగుతున్న రాచక పాలనకు సాగనంపాలని కేసీఆర్‌ను గద్దె దించేందుకు ప్రతి ఒక్కరు కంకణ బద్దులై 25 రోజులు కష్టపడాలని కోరారు. పాలేరులో కాంగ్రెస్ హస్తం మీద గెలిచి బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న కందాళ ఉపేందర్ రెడ్డి ఐదు సంవత్సరాల కాలంలో తట్టెడు మట్టి కూడా పాలేరులో పోయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు, చావా శ్రీరామకృష్ణ, రామ సహాయం నరేష్‌రెడ్డి, పార్లమెంటు ఇన్చార్జి రెహానా బేగం, రాష్ట్ర నాయకులు స్వర్ణకుమారి, జడ్పిటిసి బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, రామ్‌రెడ్డి, చరణ్ రెడ్డి, మండల పరిషత్ వైస్ ఎంపీపీ బుద్ధ వంశీకృష్ణ, గంగ్ర గోపాలరావు, న్యాయవాదులు నిరంజన్‌రెడ్డి, అరవింద్ రెడ్డి, వీర కుమార్ ఇస్లావత్ ఎంటెక్ రవి ఇస్లావత్ నరేష్ బా నోత్ రమేష్ ఇస్లావత్ నాగేష్, సిలబద్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించండి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

పాలేరు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి తమ్మినేని వీరభద్రంను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సీపీఐ(ఎం) ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ కోరారు. ఆదివారం పెద్దతండా జోన్ జనరల్ బాడీ సమావేశం నాయుడుపేటలో జోన్ కన్వీనర్ నందిగామ కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల తొమ్మిదవ తేదీన రూరల్ మండలం నుంచే నామినేషన్ కార్యక్రమం ఉంటుందని, ఈ నామినేషన్‌కు ఖమ్మం రూరల్ నుంచి వేలాదిగా సీపీఐ(ఎం) కార్యకర్తలు, అభ్యుదయవాదులు తరలివచ్చి నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియపరచాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు మొరబోయిన పుల్లయ్య, నందిగామ నాగరాజు, శ్రీనివాసరావు, ఆంటోనీ, వెంకన్న, సాయిబాబా, ఖాసిం, బాలరాజు, వీరబాబు, కౌసల్య, అచ్చమ్మ, యమున, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, హనుమంతరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం అభివృద్ధి జరగాలంటే తుమ్మలను గెలిపించండి

- డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్

నవతెలంగాణ-ఖమ్మం

వ్యక్తిగత, ప్రయోజనాలకు అవకాశం ఇవ్వకుండా కేవలం ప్రజా సంక్షేమ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కృషి చేస్తున్న సీనియర్ నాయకులు రాజకీయ అనుభవజ్ఞులు తుమ్మల నాగేశ్వరరావుని గెలిపించి ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధిని మరింత సాధించేందుకు హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం నగరంలోని 14వ డివిజన్ మధురానగర్ రోడ్ నెంబర్ 1,2 లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుస్తూ హస్తం గుర్తుకు ఓటేయాలని, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలో ఈనాడు కనిపించే అభివృద్ధి తుమ్మల హయాంలోనే ప్రతిపాదనలు చేశారని, తుమ్మల వేసి శిలాఫలకాల ఆధారంగా అభివృద్ధి జరిగింది తప్ప కొత్తగా ఏమి జరగలేదని, ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి అధికార అహంకారానికి కాకుండా అభివృద్ధికి ఓటేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే.బడే సాహెబ్, తాళ్లూరి జ్యోతి, తోట ప్రసాదు, మన్నెం, నరసింహారావు, బమ్మిడి శ్రీనివాస్, ఎస్.కే.మదర్ సాహెబ్, ఎస్.కె నాగ సైదులు, అరికట్ల శ్రీనివాసరావు బొబ్బిలి గోరెమియా, దొంత బోయిన, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు సీపీఐ(ఎం) ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-మధిర

మధిర నియోజకవర్గంలో సిపిఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే పాలడుగు భాస్కర్‌కు అత్యధిక ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని మధిర పట్టణంలో సుందరయ్య నగర్‌లో ఆ పార్టీ సీనియర్ నాయకులు రోశయ్య ఆధ్వర్యంలో ఆదివారం తొలిరోజు ఇంటింటిప్రచారం మొదలుపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక, పేదల తరఫున పోరాడేది సీపీఐ(ఎం) అన్నారు. రాజకీయ పార్టీలు ఊసరవెల్లి రంగులు మారుస్తున్నాయని, ఈసారి ఎన్నికల్లో సిపిఐ(ఎం)కి ఓట్లు వేసి గెలిపించాలని, అప్పుడు బడుగు, బలహీన, వర్గాల తరపున పోరాడి శక్తి వస్తుందని తెలిపారు. సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి పాలడుగు భాస్కర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకుల శీలం నరసింహారావు, పట్టణ కార్యదర్శి మండవ ఫణీంద్ర కుమారి, మధిర పట్టణ కమిటీ సభ్యులు తేలప్రోలు రాధాకృష్ణ, పడకంటి మురళి, పెంటి వెంకటరావు, మద్దాల ప్రభాకర్, వడ్రపు మధు, పల్లి కంటి విల్సన్, రామ కిషోర్, బండి కాశేశ్వర రావు ప్రశాంతి, నాగూర్ బి, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి తెలంగాణ సొత్తు

మొదటి పేజీ తరువాయి

ప్రజల్లో ప్రజాస్వామ్య చైతన్యం రాలేదన్నారు. ఎన్నికలు అంటే ప్రజలకు అవగాహన లేకుండా పోయిందని, ఎన్నికల హడావిడి మాత్రమే కనిపిస్తుందే తప్ప ప్రజల్లో కావాల్సినంత పరిణితి కనిపించడంలేదన్నారు. ప్రజల్లో పరిణితి చెందిన దేశాలు ముందుకు పోతున్నాయని, ప్రజలు ప్రరిణితో ఆలోచించి ఓటు వేయాలని, అభ్యర్థి గుణ, గణాలు, న్యాయకత్వ లక్షణాలు, చేసిన అభివృద్ధి చూడాలని తెలిపారు. రాష్ట్రంలో 134 ఏళ్ల చరిత్ర ఉన్న సింగరేణి పూర్తిగా తెలంగాణ ఆస్తి అన్నారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ చేతకాని దద్దమ్మల పాలన వలన కేంద్రానికి వాటా 41 శాతం వాటా ఇవ్వడం వల్ల మనకు తీరని అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ రాక ముందు సింగరేణి లాభాలు రూ.419 కోట్లు మాత్రమే ఉండేది. తెలంగాణ వచ్చిన తరువాత దాన్ని రూ. 2124 కోట్లకు తీసుకు పోయినం అన్నారు. గతంలో కార్మికులకు లాభాల వాటను రూ. 60-70 కోట్లు మాత్రమే పంచేది. ఈ దసరాకు కార్మికులకు పంచిన లాభం రూ.700 కోట్లు అని తెలిపారు. నూతన నియామకాల వలన యువ ఉద్యోగులతో కళకల లాడుతుందన్నారు. తెలంగాణ రాక పూర్వం 6400 ఉద్యోగాలు వచ్చాయని, తెలంగాణ వచ్చిన 10 ఏండ్ల కాలంలో 19463 మందికి ఉపాధి కల్పించామని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో డిపెండెంట్ ఉద్యోగాలు తీసి వేసిందని, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత డిపెండెంట్ ఉద్యోగాలు 15256 మందికి ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని వివరించారు. గని కార్మికుడు చనిపోతే కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చేవారని, ఇప్పుడు గని కార్మికుడు ప్రమాద వశాత్తు చనిపోతే రూ.10 లక్షలు ఇస్తున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అనేక మంది వస్తుంటారని, మాయ మాటలు చెప్పి, మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తారని... వాళ్ల మాటలు నమ్మవద్దన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి దళితులను పాలకులు అన్ని విధాలుగా వాడుకున్నారని, దళితులు అభివృద్ధికి ఏనాడు పాటు పడలేదని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం దళితుల అభివృద్ధికోసమే దళిత బంధు తీసుకు వచ్చిందని చెప్పారు. ప్రజలు పరిణతితో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. భద్రాద్రి రాముడు కొలువుదీరిన ఈ నేలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా నామకరణం చేశామని, జిల్లాలోజరిగిన అభివద్ధి, సం క్షేమాన్ని బేరీజు వేసుకోవాలని, బీఆర్ ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరారు. కొత్తగూడెం నియోజక వర్గంలోని పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు, మెర్రెడు వాడు కోతకు గురికాకుండా నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. సీతారమ ప్రాజెక్టు నిర్మాణ పనులు 70 శాత పూర్తి అయ్యాయని, వచ్చేది మన ప్రభుత్వమేనని మిగిలిన పనులు పూర్తిచేసి నేనే ప్రారంభిస్తానని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి అయితే జిల్లా బంగారు తునక అవుతుందని చెప్పారు. జిల్లాలో గిరిజనులకు 16769 ఎకరాల పోడు భూములను4500 మంది కుటుంబాలకు పట్టాలు ఇచ్చామని చెప్పారు. పట్టాలు ఇచ్చి, వారికి రైతు బంధు, రైతు బీమా అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, కొత్తగూడెం నియోజక వర్గం ఇన్‌చార్జీ వద్దిరాజు రవిచంద్ర, ఎంపీలు. నామ నాగేశ్వరరావు. పార్థసారథిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు, ఇల్లందు ఎమ్మెల్యే బి.హరిప్రియ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరు పాల్గొన్నారు.



టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథంను కలిసిన తుమ్మల

ఖమ్మం : తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథంను మర్యాద పూర్వకంగా మాజీ మంత్రి, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు కలిశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధా కిషోర్, సాధు రమేష్ రెడ్డి, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మిక్కిలినేని నరేందర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కేతినేని హరీశ్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) అభ్యర్థి ఎన్నికల ఖర్చుకు...

సీనియర్ నాయకుడు బాల బుచ్చయ్య రూ. 50వేలు విరాళం

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి అసెంబ్లీ స్థానంలో పోటీకి దిగనున్న సీపీఐ(ఎం) అభ్యర్థి ఎన్నికల ఖర్చు నిమిత్తం ఆ పార్టీ సీనియర్ నాయకుడు బాల బుచ్చయ్య రూ. 50వేలు విరాళం ప్రకటించారు. సత్తుపల్లిలో జరిగిన ఆ పార్టీ నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో బాల బుచ్చయ్య పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సమక్షంలో సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య ఈ విరాళాన్ని బుచ్చయ్య ప్రకటించారు. పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థికి బుచ్చయ్య విరాళం ప్రకటించడం పట్ల పోతినేని, నున్నాతో పాటు ఆ పార్టీ నాయకులు మాదినేని రమేశ్, పాండురంగారావు, శ్రీనివాస్, విఠల్‌రావులతో పాటు ఇతర ముఖ్య నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. పార్టీ తరపున ఏ ఎన్నికలొచ్చినా పోటీచేసే అభ్యర్థులకు ఆర్థికంగా సాయమందించడాన్ని బాల బుచ్చయ్య చేస్తూ వస్తున్నారు. బుచ్చయ్యను ఆదర్శంగా తీసుకొని పార్టీ అభ్యర్థుల ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు ఆర్థిక చేయూతను అందించాలని ఈ సందర్భంగా పోతినేని, నున్నా పార్టీ శ్రేణులను కోరారు.

గేటుకారేపల్లిలో బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండలం గేటుకారేపల్లికి చెందిన 100 బీఆర్ఎస్ కుటుంబాలుకు ఆపార్టీని వీడి కాంగ్రెస్ చెంతకు చేరాయి. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు సాయిన్ని తిరుపతయ్య ఆధ్వర్యంలో 100 కుటుంబాలు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బానోత్ విజయబాయి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మాజీ ఎంపీ పొంగులేటి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామంలో బీఆర్ఎస్ రెండు వర్గాల మధ్య వర్గ పోరు ఉండటం, ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరిన వారందరూ గతంలో టీడీపీ నుండి పోయిన వారు కావటం గమనార్హం. కాంగ్రెస్‌లో చేరిన ప్రముఖలలో గుడిపూడి తిరుమలరావు, చెరుకూరి వెంకటేశ్వర్లు, దుగ్గినేని సత్యనారాయణ, సాయిన్ని సైదయ్య, జక్కుల కుమార్, తాళ్లూరి అప్పారావు, మర్రి సాయి, కబీర్, కందుల అనందరావు, నూకల మోహన్, సపావట్ గోపి వరికోళ్ల వీరభద్రం, వల్లభినేని కృష్ణమూర్తి, తోటకూరి కృష్ణయ్య ఉండగా ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, గుగులోత్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు 15 మంది బాలికల జట్టు ఎంపిక

కల్లూరు : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా బాలికల జట్టు 15 మందితో ఎంపికయ్యారు. కల్లూరు మినీ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలికల జిల్లా జట్టు ఎంపిక కోసం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి 107 మంది బాలికలు హాజరయ్యారు. 15 మంది బాలికలు పోటీల్లో అత్యంత ప్రతిభ చాటటంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 15, 16, 17, తేదీల్లో మెదక్ జిల్లా తుంపురం నందు 33వ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఎంపికైన బాలికలు ఆ పోటీల్లో పాల్గొని తమ చత్తాను చాటాలని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజిఎఫ్ ట్రస్ట్ చైర్మన్ రంగారావు, నరసింహారావు హెడ్మాస్టర్ పీహెచ్ శ్రీహరి. మధిర మండలం మాటూరు వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్ కష్ణయ్య, రాము, సత్యనారాయణ రెడ్డి .కే. రాధ క్రిష్ణ.పి. కవిత రమాదేవి. ఖో ఖో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పసుపులేటి వీర రాఘవయ్య, ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. వచ్చిన క్రీడాకారులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేయటం జరిగినది.

మల్లు భట్టి విక్రమార్కని గెలిపించండి : మల్లు సూర్య

నవతెలంగాణ-మధిర



మధిర మున్సిపాలిటీ 14 వ వార్డులో ఆదివారం మల్లు భట్టి విక్రమార్క తనయుడు మల్లు సూర్య విక్రమాదిత్య కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు పథకాల గ్యారెంటీ పత్రాలను ప్రజలకు అందజేస్తూ రాబోయే ఎన్నికల్లో మల్లు భట్టి విక్రమార్కని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం.

మొదటి పేజీ తరువాయి

పాల్పడిన దోపిడీనే కారణమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సమాధి కాంగ్రెస్ పార్టీ గెలుపుకు పునాది వేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామన్నారు. బారాస ప్రభుత్వము నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లేకుండా, అవినీతిమయంతో నిర్మించి పిల్లర్స్ కుంగిపోవటానికి కెసిఆర్ కారణమయ్యారన్నారు. తొలిత ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మల్లు భట్టి విక్రమార్కు పార్టీ కార్యకర్తలు, మహిళలు యువకులు పూల వర్షం కురిపించి ఘనస్వాగతం పలికి, హారతి పళ్లాలతో కుంకుమ బొట్లు పెట్టి దీవెనలు అందించారు. అనంతరం పమ్మి, చిరుమర్రి గ్రామాల్లో వివిధ పార్టీల నుండి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శులు పందిరి అంజయ్య, సిహెచ్ ఎల్లయ్య, పసుపులేటి దేవేంద్రం, మండల ఉపాధ్యక్షులు తాటికొండ రమేష్, వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షులు సామినేని రవికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డే మాధవరావు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ మృతి

నవతెలంగాణ-వైరా



వైరా మండలం సిరిపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వైరా మండల మాజీ జెడ్పీటీసీ సభ్యులు తూము వెంకటేశ్వరరావు గుండె పోటుతో ఆదివారం మరణించారు. ఆయన భౌతికకాయాన్ని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ సందర్శించి పార్టీ జెండాను కప్పి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీవ్ర లోటు అని అన్నారు. నివాళి అర్పించిన వారిలో వైరా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డే నారాయణరావు, పుచ్చకాయల వీరభద్రం, వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, రాష్ట్ర కిసాన్ మజ్దూర్ యూనియన్ ఉపాధ్యక్షులు దాసరి డానియల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాలేటి నరసింహారావు, వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పమ్మి అశోక్ ఉన్నారు.

శ్రీయుత గౌరవనీయులైన స్పెషల్ అసిస్టెంట్ ఏజెంట్ & సబ్ డివిజినల్ మేజిస్ట్రేట్, మొబైల్ కోర్ట్ : భద్రాచలం వారి ఆదేశానుసారం

OS.NO: 353/2023

BETWEEN :-

1. కొసన లక్ష్మి, భర్త: కొసన రమణ రావు (లేట్)
2. కొసన పద్మశ్రీ, భర్త: తామరపల్లి ఆనందరావు
3. తామరపల్లి విజయలక్ష్మి, భర్త: తామరపల్లి చక్రపాణి .....వాదులు

V/S

కొసన నాగలక్ష్మి &
TO WHOM SO EVER IT MAY CONCERN ......ప్రతివాదులు

పైన పేర్కొనబడిన O.S.NO: 353/2023 కేసులో వాది 1. కొసన లక్ష్మి మరియు ప్రతివాది కొసన నాగలక్ష్మి గార్ల అత్తగారు మరియు వాదులు 2. కొసన పద్మశ్రీ మరియు 3. తామర విజయలక్ష్మి గార్ల అమ్మ గారు అయినటువంటి కొసన సీతా రత్నం, భర్త : కామేశ్వరరావు (లేట్) గారు అనారోగ్యకారణముతోది: 25-08-2023న మరణించినారు. కొసన సీతారత్నం గారికి వాదులు 1To 3 మరియు ప్రతివాది గార్లు క్లాస్-1 లీగల్ హెయిర్స్ కనుక పైన తెల్పినవాదులు కొసన సీతారత్నం గారి చర స్థిర ఆస్తులపై వారసత్వ హక్కులు, బ్యాంకు లావాదేవీలపై హక్కు పొందుటకు వారసత్వ సర్టిఫికేట్ కొరకు స్పెషల్ అసిస్టెంట్ ఏజెంట్&సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, మొబైల్ కోర్ట్, భద్రాచలం నందు పై దావా వేసియున్నారు. అట్టి దావాను గౌరవ కోర్టువారు ది.07-12-2023 తేదినకు వాయిదా వేసియున్నారు. ప్రతివాది అయిన కొసన నాగలక్ష్మీ గారికి నోటీసులు జారీచేసియున్నారు. ఇట్టి విషయమై ఇంకా ఎవరికైనా ఏమైనా అభ్యంతరములు ఉన్నచో, పై వాయిదాలో మీరు గాని, మీ లాయర్‌తో గాని సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్, భద్రాచలం గారికి మీ యొక్క అభ్యంతరములు తెలుప గలరు. లేని యెడల కోర్టు వారు పరోక్ష నిర్ణయాలు తీసుకొనబడును.

//కోర్టు వారి అనుమతితో//

ఇట్లు
చిడెం రవికుమార్
కుంభం రేఖ @ D.రేఖ
బండారు రమేష్‌బాబు
కుంభం రత్నమాల
న్యాయవాదులు, భద్రాచలం
సెల్ : 9701408695

ప్రకటన

ఇందు మూలంగా ఖమ్మం పట్టణం యావన్మందికి ,తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ కందుల గోపినాద్ తండ్రి: లేటు వెంకట్రామయ్య ఖమ్మం వారు , ఖమ్మం లో నిక్షిప్త చిట్ పండ్ లో డైరక్టర్‌గా ఉండి వున్నారు. ప్రస్తుతం నిక్షిప్త చిట్‌ఫండ్‌లో వుండుటకు ఇష్టం లేక సదురు వారికి రావలసిన వాటాను వదులుకుని నిక్షిప్త చిట్ ఫండ్ నుండి వైదొలిగినారు.భవిష్యత్తులో నిక్షిప్త చిట్ ఫండ్ జరపబోవు లావాదేవిలకు నా క్లయింట్ల కందుల గోపినాద్ తండ్రి: లేట్ వెంకట్రామయ్య గారికి ఎటువంటి సంబంధం లేదు. కావున యావన్మదికి తెలయపరచ నైనది.

మద్దినేని అశోక్ కుమార్ B.Sc.,BL.
అడ్వకేట్,రాపర్తి నగర్,ఖమ్మం.
సెల్:9246363447.

మహారాజశ్రీ గౌరవనీయులైన ఏజెంట్ టు గౌర్నమెంట్ (జిల్లా కలెక్టర్) గారి కోర్టు, భద్రాద్రి కొత్తగూడెం.

M.O.P.NO: 31/2021

బిట్వీన్:
మేడిపల్లి సీతారామయ్య ...పిటిషనర్

V/s

మేడిపల్లి లక్ష్మీనర్సమ్మ @ నిర్మల ....రెస్పాండెంట్

To,
శ్రీమతి మేడిపల్లి లక్ష్మీనర్సమ్మ @ నిర్మల భర్త: సీతారామయ్య R/o.H.No.8-238, తాళ్ల గోమ్మూరు, సారపాక, బూర్గంపాడు మండలం ,భద్రాద్రి కొత్త గూడెం జిల్లా.

నోటీసు

పైన పేర్కొన్న కేసు నందు ప్రతివాది/ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు కోర్టు వారు పంపినా కూడా మీకు ముట్టనందున , మీరు కోర్టు వారి ఎదుట హాజరుగుటకు ది.18-11-2023 నాడు వాయిదా నిర్ణయించనైనది. కావున మీరు గాని, మీ యొక్క న్యాయవాది ద్వారా గాని ది. 18-11-2023 వాడు ఉదయం 10.30 గంటలకు ఏజెంట్ టు గౌర్నమెంట్ (జిల్లా కలెక్టర్) గారి కోర్టు, భద్రాద్రి - కొత్తగూడెం వారి ఎదుట హజరుకాగలరు. లేని యెడల కేసు మీకు పరోక్షంగా తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతితో)

బండారు అరుణ్ చంద్
న్యాయవాది,భద్రాచలం.
సెల్:9490099939.

తేది:06.11.2023.

శ్రీయుత గౌరవనీయులైన స్పెషల్ అసిస్టెంట్ ఎజెంట్ మరియు సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ కోర్టు: భద్రాచలం

O.S.No.310/2023

Between:
1. ముక్కెర కోటేశ్వరి @ రాఖీభగత్, భర్త: లేట్ కృష్ణారెడ్డి.
2. ముక్కెర కలపకర్‌రెడ్డి తండ్రి: లేట్ కృష్ణారెడ్డి,వయస్సు:27 సం॥లు, వృత్తి: స్టూడెంట్.
3. ముక్కెర భార్గవి తండ్రి: లేట్ కృష్ణారెడ్డి, వయస్సు:25 సం॥లు, వృత్తి: స్టూడెంట్.

నివాసం: భద్రాచలం గ్రామం మరియు మండలం, జిల్లా: భద్రాద్రి కొత్తగూడెం.
.....వాదులు

మరియు

ఎవరికి సంబంధిస్తే వారికి
.....ప్రతివాదులు

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన వాదులు లేటు కృష్ణారెడ్డి వారసులుగా పేర్కొంటూ పై కోర్టు నందు దావా వేసినారు. అట్టి దావా ది.06.12. 2023న విచారణ ఉన్నది. ఇట్టి దావాలోని అంశములపై ఎవరికన్నా ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల పై తేది నాడు అనగా 06.12.2023న కోర్టు నందు హాజరై అభ్యంతరములు తెలుపగలరు. లేని యెడల కోర్టులో అందుబాటులో ఉన్న ఆధారములతో తీర్పు నిర్ణయించబడుతుంది.

// BY ORDER OF THE COURT//

T.CHAITANYA
S.RAJANI, CH.VIDYADHARI
Notary,Advocates,
Bhadrachalam.

నవతెలంగాణ

పాలేరు అసెంబ్లీ బరిలో తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



పాలేరు నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పోటీ చేస్తున్నారు. 13-05-1954న ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామంలో జన్మించారు. సీపీఐ (ఎం) పూర్తికాలం కార్యకర్త పని చేస్తున్న ఆయన ప్రస్తుతం సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తున్నారు.

రాజకీయ ప్రవేశం : 1971లో సీపీఐ(ఎం)లో చేరిక. సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభం. ఖమ్మం డివిజన్, ఖమ్మం జిల్లా యువజనోద్యమ నిర్మాణానికి కృషి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా అనేక ఉద్యమాలు, పోరాటాలకు నాయకత్వం వహించారు. 1985లో ఖమ్మం డివిజన్ కార్యదర్శిగా ఎన్నికైనారు. 1990లో జిల్లా తాత్కాలిక కార్యదర్శిగా, 1991లో జిల్లా కార్యదర్శిగా ఎన్నికై 1996 వరకు పని చేశారు. తిరిగి 2001లో జిల్లా కార్యదర్శిగా రెండోసారి ఎన్నికైనారు. 1986లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, 1990 నుండి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా, 1999 నుండి కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికై నేటి వరకు కొనసాగుతున్నారు. 2021లో జరిగిన అఖిల భారత మహాసభల్లో 7వ సారి కేంద్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014లో హైదరాబాద్‌లో, 2018లో నల్గొండలో మరియు 2021లో ఇబ్రహీంపట్నంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో సీపీఐ (ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైనారు.

ప్రజా ప్రతినిధిగా అనుభవం : 1991లో మొదటిసారిగా ఖమ్మం పార్లమెంట్‌కు పోటీచేసి స్వల్పతేడాతో ఓటమిచెందారు. 1996లో ఖమ్మం నుండి పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైనారు. 2004లో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎన్నికల్లో ఖమ్మం అసెంబ్లీ స్థానం నుండి శాసన సభ్యునిగా ఎన్నికైనారు.

అభిమానించే నాయకుడు : పుచ్చలపల్లి సుందరయ్య

మరిచిపోలేని అనుభవం : 2,662 కి.మీ, 100 రోజుల పాదయాత్రలో ప్రజలు చూపిన ఆదరణ.

హాబీలు : అధ్యయనం, మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని, రాజకీయ అర్ధశాస్త్రాన్ని నిరంతరం అధ్యయనం చేయటం, బోధించటం, ఇంటర్నెట్ ద్వారా ప్రతిరోజూ జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలను పరిశీలన చేయటం, విశ్లేషించటం నిత్య కార్యక్రమం. పార్టీ కార్యక్రమాన్ని, పార్టీ నిర్మాణం, రాజకీయ పరిణామాలు, క్లాసులు బోధించటంలో మంచి అనుభవం వుంది. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా అనేక మంది మేధావులు, పార్టీ నాయకులతో స్టడీసర్కిల్ నిర్వహించటం, అధ్యయనం పట్ల ఆయనకున్న పట్టుదలకు నిదర్శనం, నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల్ని తెలుసుకోవటం, పరిష్కారం చేయటం, పర్యటనలు, పార్టీ, కార్యక్రమాల్లో నిమగ్నం.

మహాజన పాదయాత్ర: తెలంగాణ సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం కొరకు 2016 అక్టోబర్ 17నుండి మహాజన పాదయాత్ర తమ్మినేని నాయకత్వంలో 9 మంది సభ్యులతో ప్రారంభమైంది. 2017 మార్చి వరకు సుమారు 5 నెలలు తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలో 4,200 పైచిలుకు కి.మీ.లు పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్రంలో దీని ప్రభావం వల్ల ప్రభుత్వం కూడా సామాజిక తరగతులకు పథకాలు ప్రవేశ పెట్టనైనది.

సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ అభ్యర్థిగా
'పాలడుగు భాస్కర్'

• 10న పాలడుగు భాస్కర్ నామినేషన్

నవతెలంగాణ-బోనకల్



ఉమ్మడి ఖమ్మం జిల్లా, ప్రస్తుత మహబూబాద్ జిల్లా గార్ల పట్టణంలో పాలడుగు చిన్న వెంకయ్య, వెంకటమ్మ దంపతుల పెద్ద కుమారుడు పాలడుగు భాస్కర్. దళిత కుటుంబానికి చెందిన పాలడుగు భాస్కర్‌ది నిరుపేద, వ్యవసాయ కార్మిక కుటుంబం. గార్లలో ప్రాథమిక విద్య, మహబూబాబాద్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, ఖమ్మంలోనే సిద్ధారెడ్డి కాలేజీలో 1992 నుంచి 1995 వరకు డిగ్రీ చదువుకున్నారు. ఈ సమయంలో ఎస్ఎఫ్ఐలో పని చేస్తూ వామపక్ష భావాలను అలవర్చుకున్నారు. అనంతరం గార్ల మండల ప్రజాశక్తి దినపత్రిక విలేఖరిగా పనిచేశారు. ఈ సమయంలోనే సీపీఐ(ఎం), సీఐటీయులో చురుకైన పాత్ర నిర్వహించారు. 1999లో గార్ల పిఎసిఎస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. గార్ల మండలంలో రైతులకు గిట్టుబాటు ధర, రుణ సదుపాయం కల్పించాలని, కల్తీ ఎరువులను, కల్తీ విత్తనాలను అరికట్టాలని తదితర రైతాంగ సమస్యలపై గట్టి కృషి చేశారు. గార్ల చెరువు కట్ట ఎత్తు పెంపుదాల ఉద్యమం, ములకనూరు ప్రాజెక్టు సాధన కోసం సాగిన ఉద్యమంలో భాస్కర్ కీలకమైన పాత్ర పోషించారు. గిరిజన ప్రాంతం గార్లలో పనిచేసిన కాలంలో పోడు భూముల సాధన, అటవీ హక్కుల చట్టం కోసం జరిగిన పోరాటంలో కీలకపాత్ర పోషించాడు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా తీసుకువచ్చిన 3 రైతు చట్టాల రద్దు కోసం సాగిన రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఢిల్లీ సరిహద్దులో సాగిన రైతాంగ పోరాటంలో కూడా భాగస్వాములయ్యారు. పార్టీ అవసరాల రీత్యా జిల్లా నాయకత్వం ఖమ్మం కేంద్రానికి తీసుకువచ్చింది. ఖమ్మం జిల్లా కేవీపీఎస్ వ్యవస్థాపక జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ జస్టిస్ పున్నయ్య ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా దళిత గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి పోరాటాల నిర్వహించారు. అనంతరం ఖమ్మం జిల్లా సీఐటియు కేంద్రంలో బాధ్యతలు నిర్వహించారు. పార్టీ అవసరాలు దృశ్యం రాష్ట్ర కేంద్రం హైదరాబాద్ కు వెళ్లారు. 2003లో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గ్రామపంచాయతీ, మున్సిపల్, వీఆర్ఏ, భవన నిర్మాణం, హమాలి, ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్, ఆశ, అంగనవాడీ, మధ్యాహ్న భోజనం, ఐకేపీ వివోఏలు, విద్యుత్, మిషన్ భగీరథ, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్, మార్కెట్ సెక్యూరిటీ గార్డ్స్, బేవరేజ్ హమాలీల రంగాలకు ప్రధాన బాధ్యతలు చేపట్టి అనేక ఆందోళనలు, పోరాటాలు నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. 2006లో కుల వివక్షత అణిచివేతకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి బీవీ రాఘవులు తో కలిసి 13 రోజులు 205 గ్రామాల్లో సైకిల్ యాత్రను నిర్వహించారు. 2007లో సిఐటియు అఖిలభారత కౌన్సిల్ సభ్యుడిగా, 2016లో ఆల్ ఇండియా వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 20 ఏళ్లుగా మునిసిపల్ పంచాయతీ, ఇతర రంగాల కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ మున్సిపల్ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీలకు నాయకత్వం వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీకి ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తూ కొండగుంట వెంకటేశ్వర్లు, వెన్నపూస గోపాల్ రెడ్డి, దేవి ప్రసాద్, స్వామి గౌడ్ లతో కలిసి పిఆర్సి సాధన పోరాటంలో ముఖ్య భూమిక పోషించారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం జరిగిన 56 రోజుల నిరవధిక సమ్మెలో రాష్ట్రమంతా పర్యటించి ఉద్యమంలో ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారు. 2022లో షెడ్యూల్ పరిశ్రమంలో పనిచేసే కార్మికులకు ప్రభుత్వం జీవోలను సవరించి వేతనాలు పెంచకపోవడాన్ని నిరసిస్తూ 22 రోజులపాటు 450 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. 2023లో గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు పెంపు, కారోబార్లకు ప్రత్యేక హెూదా కల్పించాలని డిమాండ్ చేస్తూ 350 కిలోమీటర్లు 17 రోజులపాటు వేసవిలోనే మండుటెండలో పాదయాత్ర నిర్వహించారు. 2022 మార్చిలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై ప్రస్తుతం అదే బాధ్యతలో పనిచేస్తున్నారు. 2023లో బెంగళూరులో జరిగిన సీఐటీయూ జాతీయ మహాసభల్లో జాతీయ కార్యదర్శిగా ఎంపికయ్యారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో పాల్గొన్నారు. రైతు, వ్యవసాయ కార్మికుల కూలి, భూమి, ఇండ్ల స్థలాల సాధన కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో భాగస్వామ్యం అయ్యారు. ఈ సందర్భంగా పోలీసుల నిర్బంధకాండను సైతం ఎదుర్కొంటూ శ్రమజీవులు హక్కుల కోసం పోరాటం నిర్వహించారు. పాలడుగు భాస్కర్ సిపిఎం పూర్తి కాలం కార్యకర్తగా కొనసాగుతున్నారు. ఇద్దరు పిల్లలు ఉన్నత విద్య పూర్తి చేసుకుని ప్రైవేట్ సంస్థలో ఉద్యోగాలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 30 నవంబర్ 2023న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సిపిఎం రాష్ట్ర కమిటీ పాలడుగు భాస్కర్ ను మధిర నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించింది. 10న పాలడుగు భాస్కర్ తమ నామినేషన్ దాఖలు చేయనున్నారు.

సీపీఐ(ఎం) ఖమ్మం అసెంబ్లీ అభ్యర్థిగా
యర్రా శ్రీకాంత్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థిగా యర్రా శ్రీకాంత్‌ను సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆదివారం ప్రకటించింది.

పార్టీలో బాధ్యతలు :

1982-84 వరకు ఎస్ఎఫ్ఐలో పనిచేశారు. 1991 నుండి సీపీఐ(ఎం) పూర్తికాలం కార్యకర్త. 1995లో సీఐటీయూ ఖమ్మం పట్టణ కార్యదర్శిగా, 2002లో పార్టీ ఖమ్మం టౌన్ కార్యదర్శిగా, 2009లో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2011లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికై నేటికీ కొనసాగుతున్నారు. 2019లో పార్టీ రాష్ట్ర కమిటి సభ్యులుగా మొదటిసారి తీసుకున్నారు. తిరిగి 2021 సం.లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కమిటి సభ్యులుగా ఎన్నికైనారు.

ఉద్యమ నేపథ్యం :

14 సం.ల వయసులోనే ఉద్యమంలోకి రావడం జరిగింది. చంద్రబాబు ప్రభుత్వ కాలంలో అసంఘటితరంగ కార్మికులు 1300 మందిని సమీకరించి దీర్ఘకాలిక పోరాటం చేయటంవల్ల పి.ఎఫ్‌లు, ఇతర సౌకర్యాలు సాదించటం జరిగింది. 2000 సం.లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఖమ్మం గ్రెన్‌మార్కెట్‌లో కార్మికులను ఏకంచేయడంతోపాటు, వేతనాలు, ఇతర సమస్యలపై పోరాటాలు నిర్వహించి ఫలితాలు సాధించారు. పట్టణ ఇళ్ళ స్థలాల సమస్యపై 10 సం.లపాటు జరిగిన సుదీర్ఘపోరాటానికి నాయకత్వం వహించటం జరిగింది. పట్టణ పేదలకు వెంకటగిరి, కోటనారాయణపురం, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో ఇళ్ళ స్థలాలు, ఇళ్ల సి.పి.ఎం. పోరాట ఫలితంగా వచ్చాయి. ఆ పోరాటాలన్నింటిలో శ్రీకాంత్ పాల్గొన్నారు. 2007 భూపోరాటం, 2004లో ఖమ్మం ఎం.ఆర్.ఓ. కార్యాలయం ఎదురుగా జరిగిన 9 రోజుల ఆమరణ దీక్షలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం ముందు ఇండ్ల స్థలాల కోసం 5 రోజుల పాటు దీక్షలో పాల్గొన్నారు. విద్యుత్ పోరాటంలో 21 రోజులు జైలు జీవితం గడిపారు. గ్రెన్ మార్కెట్ తరలింపును వ్యతిరేకిస్తూ అన్ని వర్గాలవారిని కలుపుకొని పోరాటాలు నిర్వహించడం ద్వారా మార్కెట్ తరలింపును తాత్కాలికంగా నిలుపుదలచేయడం జరిగింది. పట్టణంలో పార్టీ విస్తరణ, నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు.

సత్తుపల్లి అసెంబ్లీ సీపీఐ(ఎం) అభ్యర్థిగా
మాచర్ల భారతి

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థిగా మాచర్ల భారతి పోటీ చేయనున్నారు. ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించిన 14 అసెంబ్లీ స్థానాలకు ప్రకటించిన అభ్యర్థుల్లో మాచర్ల భారతి పేరు సత్తుపల్లికి ఖరారు చేశారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారతినే పోటీచేసిన విషయం విధితమే.

స్ఫూర్తినిచ్చిన నాయకులు :

పుచ్చలపల్లి సుందరయ్య, మంచికంటి రాంకిషన్‌రావు, బోడేపూడి వెంకటేశ్వరరావు, బృందా కారత్, మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయం, కొండపల్లి దుర్గాదేవి, ఏలూరి లక్ష్మీనారాయణ, పి. రాజారావు

పార్టీలో బాధ్యతలు :

ఇల్లందు డివిజన్ పార్టీ సెక్రటేరియట్ సభ్యురాలు, ఐద్వా టౌన్ & డివిజన్ సెక్రటరీగా బాధ్యతలు, పార్టీ ఇల్లందు టౌన్ కార్యదర్శి బాధ్యతలు నిర్వహించారు. 2014 సంవత్సరం నుండి ఖమ్మం జిల్లా కేంద్రంలో వుంటూ ఐద్వా జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఐద్వా జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర ఆఫీసు బేరర్స్ సభ్యురాలుగా, కేంద్ర కమిటి సభ్యురాలుగా, పార్టీ రాష్ట్ర కమిటి సభ్యురాలుగా, ఖమ్మం జిల్లా పార్టీ సెక్రటేరియట్ సభ్యురాలుగా కొనసాగుతున్నారు.

ఉద్యమాలలో కీలకపాత్ర :

2000 సం.లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 2006లో జరిగిన ఇళ్ళ స్థలాలు, భూపోరాటంలో 5 రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్షలో పాల్గొన్నారు. మహాప్రస్థానం పాదయాత్రలో పాల్గొన్నారు. భద్రాచలం దగ్గర దుమ్ముగూడెం నుండి ఖమ్మం వరకు సాగిన సాగునీటి సాధన మహా పాదయాత్రలో 13 రోజులపాటు, 300 కి.మీ.లు యాత్రలో పాల్గొన్నారు. సామాజిక న్యాయం - సమగ్రాభివృద్ధి కోసం జరిగిన మహాజన పాదయాత్రలో 15 రోజులపాటు పాల్గొన్నారు.

కేసులు - నిర్బంధాలు :

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల విడుదల కోసం చేసిన పోరాటంలో 4 రోజులు జైలు జీవితం గడిపారు. మద్య నిషేదం, రైతులకు గిట్టుబాటు ధరల కోసం జరిగిన రాష్ట్ర వ్యాప్త సరిహద్దు దిగ్బంధనం, మున్సిపల్ సమస్యలపై ఆందోళనలలో అక్రమ కేసులు బనాయించబడి నేటికీ కొనసాగుతున్నాయి.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

అమరవీరుల ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలని సీపీఐ(ఎం) ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి గంగవరపు శ్రీనివాసరావు 74వ వర్ధంతి సభను కొట్టే రామయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సభలో ప్రసాద్ మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన మహెూత్తరమైన పోరాటంలో 4 వేల మంది కమ్యూనిస్టులు అసువులు బాసారని తెలిపారు. అమరుల ఆశయ సాధన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మతతత్వ పార్టీలను పారద్రోలాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో



సీపీఐ(ఎం) నాయకులు యండపల్లి వెంకటరామయ్య, చావా నాగేశ్వరావు, పుచ్చకాయల నాగేశ్వరరావు, ఏపూరి వర కుమార్, జక్కంపూడి నాగేశ్వరరావు, మునిగంటి వెంకటేశ్వర్లు, వడ్లపూడి నాగేశ్వరరావు, మల్లయ్య, కూసు సంజీవరెడ్డి, గుర్రం చిన్న వెంకన్న, మునిగంటి వెంకటేశ్వర్లు, పాపిట్ల సత్యనారాయణ, యాదగిరి, మల్లికార్జున్, రెంటాల నాగేశ్వరరావు, సూరిబాబు, బాలిన నాగేశ్వరరావు, నేరళ్ల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు దగ్గుపాటి మల్లిక

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



మండల పరిధిలోని వెంకటగిరి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని దగ్గుపాటి మల్లిక రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికయినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో మెదక్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో మల్లిక ఖమ్మం జిల్లా జట్టు తరుపున ఖో-ఖో క్రీడల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మల్లికను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

పోరాటాల వారసుడు



సీపీఐ(ఎం) భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థిగా కారం పుల్లయ్య

• ఎన్నికల సమరానికి సిద్ధమైన పార్టీ కార్యకర్తలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఉద్యమాల పురిటి గడ్డయిన భద్రాచలం నియోజవర్గం నుండి సీపీఐ(ఎం) ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమయింది. పోరాటాల వారసుడిగా పిలుచుకునే స్థానిక యువకుడు కారం పుల్లయ్యను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించింది. ఎన్నికల పొత్తు ధర్మాన్ని విస్మరించి కమ్యూనిస్టు పార్టీలను బలహీన పరచాలన్న దురుద్దేశంతో సీట్ల సర్దుబాటులో మోసపూరితంగా వ్యవహరించిన బూర్జువ పార్టీలకు కమ్యూనిస్టు పార్టీల సత్తా చాటేందుకు సీపీఐ(ఎం) కార్యకర్తలను సిద్ధం చేసింది.

కుంజా బుజ్జి, సున్నం రాజయ్యల పోరాట వారసుడిగా ఉద్యమంలోకి వచ్చిన కారం పుల్లయ్య ఎలమంచిలి సీతారామయ్య, బండారు చంద్రావు, భీష్మారావు వంటి అమరవీరుల స్ఫూర్తితో భద్రాచలం నియోజవర్గంలో అనేక రకాల పోరాటాలలో భాగస్వామ్యం అయ్యారు. 2002లో డీవైఎఫ్ఐ దుమ్ముగూడెం మండల కార్యదర్శిగా పనిచేసిన కారం పుల్లయ్య తర్వాత కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా గిరిజన సంఘం డివిజన్ కార్యదర్శితో పాటు సీపీఐ(ఎం) భద్రాచలం ఉమ్మడి డివిజన్ కమిటీ సభ్యులుగా పనిచేశారు. ప్రస్తుతం సీపీఐ(ఎం) నియోజకవర్గ కో కన్వీనర్ బాధ్యతలతో పాటు దుమ్ముగూడెం మండల కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాధ్యతలలో ఉన్నారు. భద్రాచలం నుండి వాజేడు మండలం వరకు గ్రామ గ్రామాన పార్టీ శాఖలతో పాటు ప్రజాసంఘాల బలమున్న మార్క్సిస్టు పార్టీ ఈ ఎన్నికల్లో సత్తా చూపించడానికి యువకుడైన కారం పుల్లయ్యను ఎన్నికల బరిలో నిలిపింది. గతంలో సీపీఐ(ఎం) తరపున ఎమ్మెల్యేలుగా గెలిచిన కుంజా బుజ్జి, సున్నం రాజయ్యతోపాటు పార్లమెంటు సభ్యులుగా గెలిచిన మీడియం బాబురావులు హయాంలో జరిగిన భద్రాచల నియోజకవర్గ అభివృద్ధిని ప్రచారం చేస్తూ ముందుకెళ్లాలని నిర్ణయించుకుంది. పది సంవత్సరాల నుండి అధికారంలో ఉండి కూడా భద్రాచల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఐదు సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉండి భద్రాచలం అభివృద్ధికి ఏ మాత్రం నిధులు సాధించలేని కాంగ్రెస్ పార్టీకి ఏకకాలంలో బుద్ధి చెప్పి. భవిష్యత్తులో భద్రాచలం కోసం సీపీఐ(ఎం)ని గెలిపించాలని ప్రజల్లోకి వెళ్లేందుకు ఆ పార్టీ కార్యకర్తలు సిద్ధమయ్యారని స్పష్టమవుతుంది.

కారం పుల్లయ్య ఉద్యమ నేపథ్యం

2002లో డీవైఎఫ్ఐ దుమ్ముగూడెం మండల బాధ్యతలు నిర్వహించిన పుల్లయ్య 2004లో ప్రజానాట్యమండలి బాధ్యతలకకు వెళ్లారు. 2007 నుండి వ్యవసాయ కార్మిక సంఘం మండల డివిజన్ బాధ్యతలలో అనేక రకాల ఉద్యమాలను నిర్వహించారు. 2009 నుండి ఆదివాసీ, గిరిజన సంఘం భద్రాచలం డివిజన్ బాధ్యతలోకి వచ్చారు. 2010లో సీపీఐ(ఎం) డివిజన్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన పుల్లయ్య, 2014 నుండి డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు. 2017లో కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యునిగా 2019 నుండి దుమ్ముగూడెం మండల పార్టీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలని జరిగిన పోరాటంలో కీలక పాత్ర వహిస్తూ ఆ పోరాటంలో నమోదైన కేసుల విషయంలో 16 సంవత్సరాల పాటు కోర్టు చుట్టూ తిరిగారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని అనేక రకాల ఉద్యమాలను నిర్వహించారు. గిరిజన గిరిజనేత్ర పేదలు ఎదుర్కొంటున్న స్థానిక వ్యక్తిగత సమస్యలపై అనేక రకాల పోరాటాలను పుల్లయ్య నాయకత్వంలో నిర్వహించారు.

పార్టీలో ప్రస్తుత బాధ్యతలు : సీపీఐ(ఎం) దుమ్ముగూడెం మండల కార్యదర్శి, భద్రాచలం నియోజకవర్గం కో కన్వీనర్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

కార్మిక-శ్రామిక రంగాల పధగామి

• సీపీఐ(ఎం) పేట అభ్యర్థిగా పిట్టల అర్జున్

నవతెలంగాణ-అశ్వారావుపేట



విద్యార్థి దశలోనే వామపక్ష భావజాలంతో విద్యారంగం సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘం నాయకుడిగా గుర్తింపు తెచ్చుకుని, ప్రస్తుతం కార్మిక - శ్రామిక రంగాల పధగామిగా పనిచేస్తున్న సీఐటియు జిల్లా నాయకుడు పిట్టల అర్జున్‌ను సీపీఐ(ఎం) అశ్వారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర కమిటీ ఎంపిక చేసింది.

రాజకీయ ప్రస్థానం భారత కమ్యూనిస్ట్ పార్టీ(మార్క్సిస్ట్) అనుబంధం విద్యార్థి సంఘం ఎస్.ఎఫ్.ఐ ద్వారా 1994 లో ప్రారంభం అయింది.విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారం తో పాటు విద్యారంగంలో అనేక సంస్కరణల కోసం పలు ఆందోళనలు,నిరసనలు చేపట్టారు. 2021 నుండి 2011 వరకు దమ్మపేట మండల కార్యదర్శిగా పని చేసారు.పోడు భూములు సాధనకోసం కేసులు నమోదు అయ్యాయి.

2011 నుండి నేటి వరకు సిఐటియు జిల్లా కమిటీ,పార్టీ జిల్లా కమిటీ సభ్యులుగా అంగన్వాడి,ఆశా,మధ్యాహ్నం భోజన కార్మికులు,నిర్మాణ రంగ కార్మికులు,హమాలీ ల సమస్యలు పై నిరంతరం కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఉద్యమ నేపథ్యం : ఇంటర్మీడియట్ చదువుతూనే ఉద్యమంలోకి వచ్చారు. విద్యా రంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసారు. 2011 నుండి కార్మిక, శ్రామిక, అసంఘటిత రంగాల వేతన జీవుల సమస్యలు పరిష్కారం నిరంతరం పనిలో ఉండటం విశేషం.

కేసులు, నిర్బంధాలు ఎదుర్కుంటూ నిబద్ధతతో పోరాటాలు

నిరుపేద కుటుంబంలో పుట్టిన కామ్రేడ్ భూక్య వీరభద్రం విద్యార్థి దశ నుంచే ఎర్ర జెండా పట్టి పార్టీ సిద్ధాంతం, ఆశయాల సాధన కోసం నిరంతరం ప్రజలలో ఉంటూ ప్రజా సమస్యల పైన నికరంగా నిలబడి పోరాటం చేస్తున్నారు. ప్రజా ఉద్యమాల పోరు బాటలో కేసులూ, నిర్బంధాలను ఎదుర్కుంటూ నిజాయితీ, నిబద్ధతతో రైతులు, గిరిజనులు, మహిళలు, ప్రజల సమస్యలపైన, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల పైన అలుపెరుగని పోరాటం చేస్తున్నా ఎర్ర జెండా ముద్దు బిడ్డ భూక్య వీరభద్రం. 2018 ఎన్నికల్లో సిపిఐ(ఎం) అభ్యర్థిగా వైరా నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఒక్క రూపాయి కూడా పంచకుండా సుమారు 12000 ఓట్లు సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో సీపీఐ(ఎం) వైరా నియోజకవర్గం అభ్యర్థిగా రెండోవ సారి పోటీ చేస్తున్న కామ్రేడ్ భూక్యా వీరభద్రం గురించి స్పెషల్ స్టోరీ.

• సీపీఐ(ఎం) వైరా అభ్యర్థి భూక్య వీరభద్రం

నవతెలంగాణ-వైరాటౌన్

ఖమ్మం జిల్లా, ఖమ్మం రూరల్ మండలం, కస్నాతండా గ్రామంలోని నిరుపేద రైతు కుటుంబంలో భూక్య వీరభద్రం జన్మించారు. సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు సామ్యా నాయక్ (75), కమలమ్మ (70) దంపతులకు భూక్యా వీరభద్రం నాల్గవ సంతానంగా జన్మించారు. భూక్యా వీరభద్రానికి ముగ్గురు అక్కలు, ఒక తమ్ముడు ఉన్నారు. తల్లిదండ్రులు తమకున్న 1.30 ఎకరం భూమిలో వ్యవసాయం చేస్తూ వ్యవసాయ కూలీ పనులకు చేసుకుంటూ పిల్లలను కష్టపడి చదివించారు. తండ్రి సామ్యా నాయక్ చిన్నపుడు దాదాపు 16 సంవత్సరాల పాటు జీతం చేశారు. 20 సంవత్సరాల పాటు సిపిఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి పని చేశారు. ప్రస్తుతం సిపిఐ(ఎం) సీనియర్ సభ్యులుగా కొనసాగుతున్నారు. తండ్రి స్ఫూర్తితో భూక్యా వీరభద్రం పార్టీ పూర్తికాలం కార్యకర్తగా పని చేస్తున్నారు. తమ్ముడు భూక్యా నాగేశ్వరరావు ప్రస్తుతం కస్నాతండా సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి, ఖమ్మం రూరల్ మండల కమిటీ సభ్యులుగా పని చేస్తున్నారు. భుక్యా వీరభద్రం భార్య విజయ గృహిణి, కూతుర్లు సృజన బిటెక్, ఉషశ్రీ ఇంటర్ చదువుతున్నారు.



స్ఫూర్తినిచ్చిన కమ్యూనిస్టు నాయకులు

పుచ్చలపల్లి సుందరయ్య, మంచికంటి రాంకిషన్ రావు, బోడేపూడి వెంకటేశ్వరరావు, కేఎల్. నరసింహారావు, ఏలూరి లక్ష్మీనారాయణ, కంగాల బుచ్చయ్య తదితర నాయకుల స్ఫూర్తితో నిరాడంబర జీవితం గడుపుతూ నిరంతరం ప్రజా ఉద్యమాలు చేస్తున్నారు.

సీపీఐ(ఎం)లో నిర్వహించిన బాధ్యతలు

1999 నుండి 2002 వరకు ఎస్ఎఫ్ఐ ఖమ్మం డివిజన్ కార్యదర్శిగా, సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యునిగా పనిచేశారు. 2003 నుండి 2008 వరకు గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. 2009 నుండి నేటి వరకు గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 2008 నుండి సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ సభ్యునిగా కొనసాగుతూ ప్రస్తుతం ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా, వైరా నియోజకవర్గం పార్టీ ఇన్చార్జిగా, పోడు భూముల పరిరక్షణ కమిటీ కన్వీనర్ గా పనిచేస్తున్నారు.

ప్రజా ఉద్యమాలు, పోరాటాలలో కీలక పాత్ర.

భూక్య వీరభద్రం 2000లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. బంజారా పోరుబాట పాదయాత్రలో 60 రోజుల పాటు 500 తండాల్లో 1261 కిలో మీటర్లు పాదయాత్ర నిర్వహించారు. 2006లో జరిగిన ఇళ్ల స్థలాలు భూ పోరాటంలో, 2007లో కొణిజర్ల మండలంలో జరిగిన పోడు ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. ఈ ఉద్యమాల ద్వారా గిరిజన పేదలకు వందల ఎకరాల భూములు దక్కాయి. వైరా నియోజ కవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు భూములపై చేస్తున్న దౌర్జన్యానికి వ్యతిరేకంగా 10 రోజులపాటు మండుటెండలో 250 కిలోమీటర్లు పోడు భూముల పరిరక్షణ పాదయాత్ర నియోజకవర్గ వ్యాప్తంగా చేశారు. వైరా నియోజకవర్గంలో నకిలీ మిర్చి విత్తన బాధిత రైతులకు అండగా నిలబడి ఉద్యమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం వైరా నియోజకవర్గంలో 4000 మంది రైతులకు వర్తించలేదని, రైతులందరికీ రుణమాఫీ చెయ్యాలని రైతులతో కలిసి మండల స్థాయి నుండి రాష్ట్రస్థాయి ఉద్యమాన్ని నిర్మించారు. హక్కుపత్రాలు కలిగిన గిరిజనులకు బ్యాంకు రుణాల కోసం ప్రత్యేక ఉద్యమం చేపట్టి ఏన్కూరు, కారేపల్లి, జూలూరుపాడు, కొణిజర్ల మండలాలలో వందలాది రైతులకు బ్యాంకు రుణాలు ఇప్పించారు. 2022-23 సంవత్సరంలో సిపిఐ(ఎం), వామపక్ష పార్టీలు సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజాపంథా, కాంగ్రెస్, టిడిపి గిరిజన సంఘాలను కలుపుకొని పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం పైన పోడు రైతుల పొలికేక సభలు, రహదారుల దిగ్బంధం చేసి రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి పోడు రైతులకు హక్కు పత్రాలు ఇప్పించడంలో కీలకపాత్ర పోషించారు. పోడు రైతులకు అండగా నిలబడ్డారు. పోడు హక్కు పత్రాలు సాధించిన కారేపల్లి మండలం చీమలపాడు ప్రాంతం రైతులకు ఇల్లందు యూనియన్ బ్యాంక్ రుణాలు ఇవ్వకుండా తిరస్కరిస్తే వందలాది మంది రైతులను సమీకరించి బ్యాంకును ముట్టడించి కొత్తగా ఇచ్చిన హక్కు పత్రాల పైన రుణాలు ఇప్పించిన చరిత్ర భూక్యా వీరభద్రంకు ఉన్నది. వైరా ఆయకట్టు రైతులకు సాగు నీళ్ల కోసం ప్రణాళిక బద్ధంగా ఉద్యమం ద్వారా నీళ్ల సాధించడంలో భాగస్వామ్యం వహించారు. కారేపల్లి మండల కేంద్రం పోడు ఉద్యమానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించి ప్రభుత్వం, ఫారెస్ట్ అధికారుల పైన పోరాడి పేదల జోలికి రాకుండా ప్రభుత్వం ద్వారా రాతపూర్వకంగా హామీని సాధించడంలో కీలక పాత్ర పోషించారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో 2005-06లో ఖమ్మంలో ఇంటర్, డిగ్రీ గిరిజన విద్యార్థులకు ఎస్ఎం హాస్టల్స్ సొంత భవనాలు ఏర్పాటుకై కలెక్టరేట్ ముందు నిరాహార దీక్షలు చేసి హాస్టల్స్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.

కేసులు - నిర్బంధాలు ఎదుర్కుంటూ ప్రజా ఉద్యమాలు.

2000లో విద్యుత్ ఉద్యమం సందర్భంగా నాన్ బెయిలబుల్ కేసులో వరంగల్ సెంట్రల్ జైలులో 18 రోజులు, 2006 ఇళ్ల స్థలాలు భూ పోరాట ఉద్యమంలో వరంగల్ సెంట్రల్ జైల్లో 22 రోజులు, 2007-08 మేకాలకుంట, విక్రమ్ నగర్ లలో జరిగిన పోడు ఉద్యమం సందర్భంగా రెండుసార్లు ఖమ్మం జైలులో 30 రోజులు నిర్బంధించబడ్డారు. 2011-12 విక్రమ్ నగర్, గుబ్బగుర్తి ప్రాంతాలలో పోడు ఉద్యమం జరిగిన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం పిడి యాక్ట్ పెట్టి చర్లపల్లి జైల్లో ఆరు నెలలపాటు నిర్బంధించారు. ఈ సందర్భంగా ఎల్లన్ననగర్ దగ్గర ఫారెస్ట్, పోలీస్, రెవిన్యూ అధికారులు నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసి, విష ప్రయోగం ద్వారా భూక్యా వీరభద్రంను చంపే ప్రయత్నం ప్రభుత్వం చేసింది. అనేక సందర్భాలలో గిరిజన హక్కుల కోసం జరిగిన పోరాట ఉద్యమాలలో అక్రమ కేసులు బనాయించారు.

చైతన్యంతో ఆలోచించి సీపీఐ(ఎం)కు ఓటు వేయండి

నేటి సమాజంలో చట్టసభలలో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం చాలా ఉన్నది. ప్రజల పక్షాన నికరంగా నిలబడి నిజాయితీగా పోరాటం చేస్తున్న సిపిఐ(ఎం) పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆదరించాలి, ఓట్లు వేసి గెలిపించాలి. అసెంబ్లీలో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం ఉంటేనే ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుంది. వైరా నియోజకవర్గ ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా చైతన్యంతో ఆలోచించి సిపిఐ(ఎం) అభ్యర్థి భూక్యా వీరభద్రంకు ఓట్లు వేసి గెలిపించాలి.

మత్తు...చిత్తు

- మత్తులో యువత
- కౌన్సెలింగ్ కేసులు నమోదైనా
మారని వైనం

నవతెలంగాణ-మణుగూరు



గత పదేండ్ల క్రితం ఏజెన్సీ ప్రాంతంలో గుడుంబా వాసన గుప్పుమంది. గంజాయి వాసన అంటేనే తెలియనటువంటి యువత ఆధునిక పోకడలు యువత పెడమార్గానికి నేడు గంజాయి ముఖ్య సాధనంగా మారిపోయింది. పల్లెల్లో పొద్దంతా కాయ కష్టం చేసి సాయంత్రమైతే శ్రమను మరిచేందుకు ఎంతోకొంత మద్యాన్ని సేవిస్తారు. అయినా ఆ కుటుంబాలలో మద్యం అనేది పెద్దగా చెడు ప్రభావం చూపలేదు. నేడు విద్యార్థి దశ నుండే వక్రమార్గంలో పయనిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు ప్రధాన కారణం అవుతున్నారు. చదువుని మధ్యలో మానేసిన వారు కొందరైతే, వారిని ఆసరాగా చేసుకుని గోదావరి తీరం ఆవలి వైపు నుండి మచ్చుకు ఒక ప్యాకెట్ చొప్పున గంజాయిని రవాణా చేస్తూ నేడు అన్ని పల్లెల్లోనికి విస్తరింప చేశారు. కొందరు ప్రబుద్ధులు ఇదే తమ లోకమని గంజాయిని సేవిస్తే స్వర్గంలో విహరిస్తామన్నా అపోహతో చిన్నల నుండి పెద్దల వరకు మారుమూల పల్లెల్లో గుట్టుగా సాగుతున్న వ్యవహారం. గంజాయి ప్రవేశంతో యువత బంగారు భవిష్యత్తు చిత్తవుతుందని పోలీసు యంత్రాంగం గంజాయి రవాణా విక్రయాలపై నిఘా పెట్టింది. పోలీసులను బురిడీ కొట్టిస్తూ మత్తులో జోగుతుంది. యువత గంజాయి సేవించి కుటుంబాలలో అలజడులు రేపుతూ కొన్ని గ్రామాలలో అల్లకల్లోలాని సృష్టిస్తున్నారు. గంజాయి సేవించిన వారు నాడు గుట్టుగా సాగిన గంజాయి వ్యవహారం నేడు ప్రతి పల్లెను తాకింది. పాన్ షాపుల నుండి కిరాణా షాపుల వరకు విస్తరించిందంటే దాని ప్రభావం యువత ఎంత మేరకు ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. చత్తీస్గఢ్, ఒరిస్సా వంటి ప్రాంతాల నుండి గంజాయి రవాణా అవుతున్నట్లు గుర్తించి పోలీసులు మాటు వేసి కొందరిని అదుపులోనికి తీసుకుని అరెస్టు చేసిన నియంత్రించలేకపోతున్నారనే అపవాదులను మూటగట్టుకుంటున్నారు. పినపాక మండలంలో ఏడుల భయ్యారం, తోగూడెం, ఉప్పాక, ఎక్కడిగూడెం, జానంపేట, దుగినేపల్లితోపాటు మణుగూరు పట్టణంలోని పైలట్ కాలనీ, చాపల మార్కెట్ ఏరియా, బాంబే కాలనీ, చంద్రబాబు నగర్, గాంధీనగర్ ఏరియాలతో పాటు రైల్వే స్టేషన్ ప్రాంతంలో గంజాయి సేవించడం రవాణా చేయడం అంటే కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. బీటీపీఎస్ ఏర్పాటు చేయడంతో వివిధ ప్రాంతాల నుండి కూలీలు, కార్మికులకు గంజాయి రవాణాకు పాల్పడుతున్నారన్న ఆరోపణల సైతం ఉన్నాయి. ఈ విషయంపై ఇప్పటికే అనేకసార్లు వారిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకునే కేసులు కూడా నమోదు చేశారు. వీరి వల్ల పచ్చని పల్లెలు గంజాయి వాసనలతో గుబాళిస్తున్నాయన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. వాహనాల ద్వారా పొరుగు రాష్ట్రాల నుండి భద్రాచలం మీదుగా మణుగూరు, పినపాక ప్రాంతాలకు రవాణా జరుగుతున్న విషయాన్ని పసిగట్టిన పోలీసులు ఉక్కు పాదం మోపిన రవాణా, సేవించడం అదుపులోనికి రాలేదు. దీంతో పల్లె ప్రాంతాలలో పోలీసులు తల్లిదండ్రులకు యువతకు కౌన్సిలింగ్ చేశారు. తీరు మార్చుకొని వారిపై కేసులను కూడా నమోదు చేశారు. అయినా గంజాయి వాసనలు మణుగూరు, పినపాకల్లో గుప్పుమంటూనే ఉన్నాయి. గంజాయి రవాణా విక్రయాలను అదుపులోనికి తేవాలంటే సంయుక్త కార్యాచరణతోనే సాధ్యం అంటున్నారు. పలువురు గ్రామంలోని రాజకీయ పార్టీలను స్వచ్ఛంద సంస్థలను, ప్రజాసంఘాలను, పొదుపు సంఘాలను, ప్రజాప్రతినిధులను గ్రామ పెద్దలను ఐక్య కమిటీలుగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి దుర్వ్యసనాలపై అవగాహన కల్పిస్తూ పకడ్బందీ చర్యలు చేపడితే తప్ప ఈ మహమ్మారిని అడ్డుకోవడం సాధ్యం కాదు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని, యువత భవిష్యత్తును కోరుకుంటున్న వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పొదెం ప్రచారం

నవతెలంగాణ-భద్రాచలం

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాచలం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య దూసుకు పోతున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకే భద్రాచల కాలేజ్ గ్రౌండ్‌కు వెళ్లి అక్కడ వాకింగ్ చేస్తున్నటువంటి సీనియర్ సిటిజన్స్‌తో, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, పట్టణ ప్రముఖులు, యువతతో కలిసి క్రికెట్, వాలీబాల్ క్రీడను ఆడి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా భద్రాచల ఎన్నికల బరిలో ఉన్న తనని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ...భద్రాచలం అభివృద్ధికి నోచకో పోవటానికి కారణమైన బీఆర్ఎస్ పార్టీకి భద్రాచల ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. పోయిన ఎన్నికల్లో నిరుద్యోగ భృతి రూ.3016 ఇస్తానని హామీ ఇచ్చి, ఈరోజు వరకు ఇవ్వకుండా నిరుద్యోగ యువతను మోసం చేశారని, ఇంటికో ఉద్యోగం అని గద్దెనెక్కి 10 ఏళ్లలో యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కూడా ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలోచన చేయలేకపోయిందన్నారు. 100 కోట్లు 1000 కోట్లు అంటూ భద్రాచల ప్రాంత అభివృద్ధిని శూన్యం చేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి కేవలం భద్రాచల ప్రజల ఓట్లు కావాలి కానీ, భద్రాచల ప్రజల సమస్యలు పట్టవని అన్నారు. భద్రాచల ప్రాంతం, రామాలయ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నా. ఈ ఎన్నికల ప్రచారంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ల నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ చైర్మన్ చింతిరేల రవి కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భోగాల శ్రీనివాసరెడ్డి, అడబాల వెంకటేశ్వరరావు, ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ల వెంకటేష్, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు చింతల సుధీర్, రాసమల్ల రాము, రాగం సుధాకర్, సూరంపూడి రాంప్రసాద్, సిద్ది గణేష్, శ్యామ్ కొల్లపూడి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ఇవే నాకు చివరి ఎన్నికలు..

- కేసీఆర్ ఆశీర్వాదంతో ఐదోసారి పోటీ
- ఇవే నాకు చివరి ఎన్నికలు.. గెలిపించండి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా

నవతెలంగాణ-పాల్వంచ

ముఖ్యమంత్రి అభివృద్ధి ప్రధాత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆశీర్వాదంతో ఐదోసారి పోటీ చేస్తున్నానని నా తుది శ్వాస వరకూ ప్రజాసేవ చేస్తానని బీఆర్ఎస్ కొత్తగూడెం అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆశీర్వాద సభ జరిగింది. ఈ సందర్భంగా తొలుత ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఆశీర్వాదంతో కొత్తగూడెం నియోజకవర్గంలో అభివృద్ధిలో దూసుకుపోయిందని, పాల్వంచ, కొత్తగూడెం అభివృద్ధికి రూ.1000 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. జిల్లా కలెక్టరేట్ మెడికల్ కాలేజ్ జీవో నెంబర్ 73, 76 తీసుకొచ్చి 12 వేల మందికి ఇండ్ల స్థలాలు కిన్నెరసాని పైపులను 35 కోట్లు మంజూరు చేశారని అన్నారు. 817 సర్వే నెంబర్లు అందరికీ ఇంటి పట్టాలు ఇచ్చే విధంగా కేసీఆర్ వల్లే అవుతుందని అన్నారు. ఇవే నాకు చివరి ఎన్నికలని అభివృద్ధి చేశానని, గెలిపించుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ వస్తేనే తెలంగాణ బాగుపడుతుందని, ప్రజలు సుఖంగా ఉంటారని చెప్పారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

డాక్టర్ తెల్లం సతీమణి ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం నియోజక వర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు సతీమణి ప్రవీణ భద్రాచలం అశోక్ నగర్‌లో ఆదివారం ఇంటింటా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున బరిలో నిలిచిన తెల్లం వెంకట్రావును అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేని ప్రకటన పట్ల జర్నలిస్టుల హర్షం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రజలకు ప్రభుత్వాలకు వారధులుగా ఉంటూ సమాజ శ్రేయస్సు కోరే జర్నలిస్టులను సీపీఐ(ఎం) పార్టీ వారి సేవలను గుర్తించింది. ఈ నెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తాము తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే జర్నలిస్టులకు సముచిత స్థానం కల్పించే విధంగా సీపీఐ(ఎం) తమ ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకటించింది. తాము అధికారంలోకి రాగానే జర్నలిస్టులందరికి ఇళ్లు, ఇండ్ల స్థలంతో పాటు రూ.10 వేల పెన్షన్ అందజేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. దీంతో జర్నలిస్టు సంఘాలతో పాటు జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు సీపీఐ(ఎం) పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను స్వాగతిస్తున్నారు.



పాయం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అతహార్, సుధాకర్

నవతెలంగాణ-అశ్వాపురం

పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో అశ్వాపురం సీనియర్ నాయకులు, తుమ్మల అడుగు జాడల్లో నడిచే అభిమాని మొహమ్మద్ అతహార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కరకపల్లి సుధాకర్ పార్టీలో చేరినట్లు ఆదివారం వారు ఓ ప్రకటనలో తెలిపారు. రానున్న ఎన్నికల్లో పాయం గెలుపు కోసం మా రాజకీయ అనుభవాన్ని ఉపయోగించి అశ్వాపురం మండలంలో పార్టీకి అధిక మెజారిటీ ఓట్లు వచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికల దృష్ట్యా పినపాక నియోజకవర్గంలో, అశ్వాపురం మండలంలో బారసకు ఎదురు గాలి వీస్తోందని, అది ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తేటతెల్లం అవుతుందని వారు జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాయం రామ నర్సయ్య, మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, మాజీ ఉప సర్పంచ్ గుంతోజు సదానందచారి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి తగిన రీతిలో బుద్ధి చెబుదాం

- ఆత్మీయ సమ్మేళనంలో టీడీపీ నాయకుల నిర్ణయం

నవతెలంగాణ-బూర్గంపాడు



జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు టీడీపీ నాయకులు, అభిమానులు సిద్ధంగా ఉండాలని ఆత్మీయ సమ్మేళనంలో పలువురు టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఆదివారం బూర్గంపాడు మండలం సారపాకలో చంద్రబాబు నాయుడు అభిమానులు, టీడీపీ, సీపీఐ నాయకులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి దాదాపు 200 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా బీఆర్ఎస్, వైఎస్ఆర్సీపీ పార్టీపై టీడీపీ, సీపీఐ నాయకులు నిప్పులు చెరిగారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై తెలంగాణలో లొల్లి ఎందుకు అని పగడ్బాలు పలికిన బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పే సమయం ఆసన్న మైందని వారు పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు విమర్శిస్తే ఎలా ఉంటుందో ఈసారి ఓట్ల రూపంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీకి తెలియజేయాలని టీడీపీ నాయకులు కోరారు. అనంతరం సీపీఐ నాయకులు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు తాము కట్టుబడి పనిచేయడమే మా పార్టీ ముఖ్య ఉద్దేశ్యమని వారు పేర్కొన్నారు. పార్టీ అధిష్టాన నిర్ణయం ఇప్పటికే తెల్పి చెప్పడం జరిగిందని, కేసీఆర్‌ను గద్దె దింపేందుకు కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో సపోర్ట్ చేస్తున్నట్లుగా తెల్పి చెప్పారు. ఈ ఆత్మీయ సమ్మేళానికి హాజరైన వారందరూ తమ చప్పట్లతో ఈసారి తమ ఓటు హస్తం వైపు ఉంటుం దని చెప్పకనే చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోటు రంగారావు, జగదీష్ రావు, సత్యనారాయణ, కన్నదారి రమేష్, ఐటీసీ టీఎన్టీయూసీ అధ్యక్షులు కనకమేడల హరి ప్రసాద్, సిపిఐ సీనియర్ నాయకులు నలజాల, సత్యనారాయణ, మువ్వ వెంకటేశ్వరరావు, చంద్రబాబు అభిమానులు టిడిపి కార్యకర్తలు, సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత పెన్షన్.. ప్రభుత్వ ఉద్యోగి హక్కు

నవతెలంగాణ-మణుగూరు



పాత పెన్షన్ ప్రభుత్వ ఉద్యోగి హక్కు అని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు అన్నారు టీఎస్ యూటీఎఫ్ మణుగూరు మండల అధ్యక్షులు షేక్ మీరా హుస్సేన్ అధ్యక్షతన జరిగిన పాఠశాలల సందర్శన కార్యక్రమంలో మణుగూరు గర్ల్స్ ఉన్నత పాఠశాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఉద్యోగికి పెన్షన్ చెల్లించుట అనేది ప్రభుత్వాల సామాజిక బాధ్యత అన్నారు. కొత్త పెన్షన్ విధానం వలన ఉద్యోగి రిటైర్మెంట్ తరువాత ఉద్యోగ కుటుంబాలు వీధిన పడుతున్నాయని అన్నారు. కొత్త పెన్షన్ వలన ప్రభుత్వ ఉద్యోగులు అభద్రతాభావంతో ఉన్నారని తెలియజేశారు. మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవంబర్ మూడవ తేదీన ఎస్‌టీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఢిల్లీలో చలో పార్లమెంటు నిర్వహించామని తెలియజేశారు. కొత్త పెన్షన్ పై ప్రభుత్వ ఉద్యోగుల నిరసనను తెలియజేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు షేక్ మీరా హుస్సేన్ మండల ప్రధాన కార్యదర్శి కారం సీతారామయ్య, జిల్లా కార్యదర్శి బి.రాము, సంఘ సభ్యులు పూజిత, ఇంద్రసేనారెడ్డి, పినపాక మండల ప్రధాన కార్యదర్శి బి.భాస్కరరావు, మణుగూరు బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం స్వర్ణ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | నవంబర్ 06 2023 | www.navatelangana.com

అమరవీరుల త్యాగాల ఫలితమే భద్రాద్రి అభివృద్ధి

- ప్రజలకు అండగా నిలవడమే భీష్మారావుకు మనం ఇచ్చే నివాళి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్



నవతెలంగాణ-భద్రాచలం

అమరవీరుల త్యాగాల ఫలితంగానే భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, సమస్యల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే అమరజీవి కామ్రేడ్ బత్తుల భీష్మారావుకు మనం ఇచ్చే ఘన నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ అన్నారు. బత్తుల భీష్మారావు 38వ వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం ఏజెన్సీలో అభివృద్ధి నిరోధక శక్తులుగా ఉన్న ఆనాటి మావోయిస్టు గూండాలు విఆర్‌పురం మండలం జీడిగుప్ప అటవీ ప్రాంతంలో కాపుగాచి దాడి చేసి ప్రాణాలు తీశారని అన్నారు. ఈ దాడిలో బత్తుల భీష్మారావు అక్కడికక్కడే మృతి చెందారని, కామ్రేడ్ చంద్రావు నెల రోజులపాటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించారని గుర్తు చేశారు. ఆ దాడిలో ఆనాటి ఎమ్మెల్యే కుంజా బొజ్జి, మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్యలకు గాయాలు అయ్యాయని అన్నారు. భద్రాచలం ఏజెన్సీలో మారుమూల గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన అనేకమంది సీపీఐ(ఎం) నాయకులు బండారు చంద్రావు, బత్తుల భీష్మారావు, శ్యామల వెంకటరెడ్డి, పులి రామయ్య, మడివి మూకయ్య మొదలగు నాయకులను మావోయిస్టు గూండాలు హత్య చేశారని అన్నారు. సీపీఐ(ఎం) నాయకులు త్యాగాల ఫలితంగానే భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి చెందిందని అన్నారు. అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఎర్రజెండాను ముందుకు తీసుకోవాలని రానున్న ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.రేణుక, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకట రామారావు, యన్.లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు ఎన్.నాగరాజు, భూపేంద్ర, కున్జా శ్రీనివాస్, సత్య, సీనియర్ నాయకులు ఏం.వి.ఎస్ నారాయణ, నేలపట్ల భాస్కర్ రెడ్డి, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

విదేశాగమన శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

గుండాల మండలం దామరతోగు గ్రామం నుండి కుంజ రవికుమార్, లక్ష్మి దంపతులు బ్లూ లైఫ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సౌజన్యంతో ఆదివారం రాత్రి మలేషియా ఇంటర్నేషనల్ ట్రిప్‌కు వెళ్ళుతున్న ఇరువురికి ఫినిక్స్ గ్రూప్ సభ్యులు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రూప్ సభ్యులు పెండకట్ల సాయి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతంలో జన్మించి రవికె, లక్ష్మి నెట్వర్క్ మార్కెటింగ్ లోనే అద్భుతమైన ప్లాట్ ఫాం ఏర్పరచారన్నారు. బ్లూ లైఫ్ కంపెనీ ద్వారా ఎంతో మందికి ఆరోగ్యాన్నిచ్చి, ఎంతోమందికి ఆదాయాన్నిచ్చి వారు ఆదర్శంగా నిలిచారన్నారు. బ్లూ లైఫ్ లోనే నైట్ ర్యాంక్ అచీవ్ మెంట్ తీసుకొని విజయవంతమైన లీడర్ గా టీంని బిల్డ్ చేస్తూ నేడు విదేశీ యానం చేస్తున్న మా లీడర్‌కు విదేశీయానం సంతోషంగా గడవాలని కోరారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఫినిక్స్ గ్రూప్ సభ్యులు హరి, కుమార్, రమేష్ బాబు, శ్రావణ్, రాజకుమార్, రజినీ, హరిక్రిష్ణ, మాధవి, సత్యానారాయణ, నర్సమ్మ, రమేష్, లక్కీ, బాబీ, కవిత, చంద్రశేఖర్ ఉన్నారు.

సీఎం సభ కోసం అనువైన స్థలాన్ని పరిశీలించిన రేగా



నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు, జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో కలిసి, అనువైన స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులతో పాటు, ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బిక్కసాని శ్రీనివాస్ రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కామిరెడ్డి రామ కొండారెడ్డి, పార్టీ యువజన మండల అధ్యక్షులు గోనెల నాని, మాజీ ఎంపీటీసీ సభ్యులు వల్లూరు పల్లి వంశీకృష్ణ, సారపాక పార్టీ టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయాలి

- విప్ రేగా కాంతారావు



నవతెలంగాణ-మణుగూరు

పినపాక నియోజకవర్గంలోని బూర్గంపాడు మండలంలో ఈ నెల 13వ తేదీన ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు విప్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో పినపాక నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి మీ ముందుకు వస్తున్నానని, నిండు మనసుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు. ప్రజా ఆశీర్వాద సభకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, వేలాది మంది ప్రజలు తరలివచ్చి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయగలరని ఆయన కోరారు.

గెలుపు బాధ్యత బూత్ కమిటీలదే



నవతెలంగాణ-చంద్రుగొండ

రానున్న శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు బాధ్యత బూత్ కమిటీలదేనని బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగొండి రాఘవులు స్పష్టం చేశారు. ఆదివారం దామరచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ గ్రామస్థాయి విస్తృతస్థాయి సమావేశంలో వీరువురు మాట్లాడారు. బూత్ కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలను అప్పగించారు. అశ్వారావుపేట శాసనసభ బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెపించాలన్నారు. కారు గుర్తును ప్రతి ఓటరుకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, శ్రేణులు కొణకండ్ల వెంకటరెడ్డి, సయ్యద్ రసూల్, నరుకుళ్ల సత్యనారాయణ, మండల రైతు సమితి సభ్యులు నరుకుల్ల వాసు, ఇర్పా లక్ష్మిపతి, బానోత్ రనియా, నల్లమోతు వెంకటనారాయణ, భూపతి రమేష్, మేడా మోహన్ రావు, సూర వెంకటేశ్వరరావు, గుగులోత్ శ్రీనివాస్నాయక్, మల్లెంపాటి నాగేశ్వరరావు, భూపతి శ్రీనివాసరావు, మద్దిరాల చిన్నపిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత షుగర్ టెస్ట్‌లు

నవతెలంగాణ-మణుగూరు

లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత షుగర్ టెస్ట్‌లు నిర్వహించారు. మణుగూరు మున్సిపాలిటీలోని పూల మార్కెట్ సెంటర్‌లో శ్రీదేవి మెడికల్ షాప్ వద్ద లయన్స్ క్లబ్ మణుగూరు వారు ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షలు షుగర్ రోగులకు నిర్వహించారు. షుగర్ రోగులకు షుగర్ స్థాయిలపై, ఆహారం పై, జీవన విధానం పై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ గాజుల పూర్ణచందర్ రావ్, సెక్రటరీ షేక్ మీరా హుస్సేన్, డిస్ట్రిక్ట్ చైర్పర్సన్స్ డాక్టర్ దుస్స సమ్మయ్య, ముత్తం శెట్టి నాగేశ్వర రావు, ఆడబాల నాగేశ్వరరావు, షుగర్ వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు 15 మంది ఎంపిక



నవతెలంగాణ-దమ్మపేట

33వ తెలంగాణ రాష్ట్ర ఖో ఖో అసోసియేషన్ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా (బాలురు) జట్టు ఎంపికకు వివిధ పాఠశాల నుండి వచ్చిన 85మంది విద్యార్థి పాల్గొన్నారు. ఈ ఎంపికలు దమ్మపేట మండలంలోని ప్రభుత్వం గిరిజన ఉన్నత పాఠశాల పార్కలగండిలో ఆదివారం నిర్వహించారు. కాగా ఈ పోటీలకు 15మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 15, 16, 17 తేదీల్లో మెదక్ జిల్లా తూంపురం నందు క్రీడల్లో పాల్గొననున్నారు. ఈ ఎంపికకు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీ కె.రాందాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బి.గోపాలరావు, అలాగే సెలెక్షన్స్ కమిటీ ఎస్.రామారావు, పి.పవన్ కుమార్, కె.వెంకటేశ్వర్లు, ఏ.కృష్ణ, సమ్మయ్య ప్రసాద్, కిరణ్, పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి సేవలు ప్రశంసనీయం

- ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగరాజు



నవతెలంగాణ-చంద్రుగొండ

పుట్టపర్తి సత్యసాయి సేవా సమితి సేవలు ప్రశంసనీయమని ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగరాజు అన్నారు. ఆదివారం సీతాయిగూడెం గ్రామంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గర్భిణీలకు శ్రీమంతాలు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. రోగులకు వైద్యంతో పాటు, న్యూట్రీషన్ ఫుడ్, నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేసే ఏ సంస్థకైనా ప్రజాదరణ ఉంటుందని, మానవసేవే మాధవ సేవ అనే సూక్తిని సత్యసాయి సేవా సమితి పక్కగా పాటిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కీసరి శాంతమ్మ, గ్రామస్తులు భద్రయ్య, మెడికల్ ఆఫీషర్లు కనకం తనూజ, ప్రియాంక, వైద్యులు సీతరాంప్రసాద్, సత్యసాయి సేవా సమితి జిల్లా బాధ్యులు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ మావోయిస్టుల కరపత్రాలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని తూరుబాక బ్రిడ్జి సమీపంలోని బండారుగూడెం బస్టాండ్ వద్ద సీపీఐ మావోయిస్టు పేరిట ఆదివారం కర పత్రాలు వెలశాయి. భద్రాచలం, చర్ల ప్రదాన రహదారి పై నిత్యం ప్రజలు సంచరించే ప్రదేశంలో కరపత్రాలు వెలియడంతో కలకలం సృష్టిస్తున్నాయి. నిత్య పోలీసులు ప్రదాన రహదారి వెంబడి వాహన తనిఖీలు వంటివి చేస్తున్నప్పటికీ ఎన్నికలు బహిష్కరించాలంటూ కరపత్రాలు వెలియడంతో పోలీసులకు సవాల్ విసిరినట్లు అయింది. సిపిఐ మావోయిస్టు పేరిట వెలసిన కరపత్రాలలో ఆదివాసీ ప్రజలారా ఓట్ల కోసం వస్తున్న పార్టీలను నిలదీయండి మీ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఎన్నికలను బహిష్కరించాలని కరపత్రాలలో పేర్కొన్నారు. ఆదివాసీ ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని జల్ జంగిల్ జమీన్ పై పూర్తి అధికారం ఆదివాసీలకే చెందాలని, 1/70 చట్టాని, జీవో నెం 03ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు పేరుతో కరపత్రాలు వెలియడంతో మండల వ్యాప్తంగా పెద్ద చర్చ సాగుతోంది.

బెల్టుషాపులు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు



నవతెలంగాణ-ములకలపల్లి

ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో కలసి శనివారం ఎక్సైజ్ పోలీసులు మండల వ్యాప్తంగా అనుమానిత దుఖానాలలో తనిఖీలు నిర్వహించారు. మండలంలోని మూకమామిడి, వుుత్యాలంపాడు, జగన్నాధపురం, రాజపురం గ్రామాలలో బెల్టుషాపులు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తుల నుంచి సుమారు రూ.30 వేల విలువగల మద్యాన్ని సీజ్ చేసి నలుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గురునాథ్ రాథోడ్ తెలిపారు. ఎన్నికల వేళ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం, ఇరిగేషన్ డీఈ మోతిలాల్, పోలీసు సిబ్బంది, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

సత్యం మృతి పార్టీకి తీరని లోటు

నవతెలంగాణ-జూలూరుపాడు

పేద ప్రజల కోసం అనేక ఉద్యమాలను చేసిన సత్యం మృతి పార్టీకి తీరని లోటని ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు, రైతు రవితేజ అన్నారు. సుజాతనగర్ మండలం అంజనాపురం గ్రామానికి చెందిన మాజీ సీపీఐ(ఎం) నాయకులు, మాజీ సొసైటీ డైరెక్టర్ ఏలూరు సత్యం వర్ధంతిలో ఆదివారం జరిగింది. రవి పాల్గొని ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి పరచడంలో ముఖ్య పాత్ర పోషించి అదేవిధంగా సొసైటీ డైరెక్టర్ చేసి ఎన్నో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, కావేరి, కనకమ్మ, రాజేష్, శ్రీకాంత్, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జన ప్రభంజనం...

- పార్టీ శ్రేణుల్లో జోష్ నింపిన కేసీఆర్
- సభ సక్సెస్‌తో వనమా గెలుపు ఖాయమంటున్న పార్టీ శ్రేణులు
- కళాకారులతో పురవీధుల్లో నృత్యాలు



నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెంలో జనసంద్రమైంది. ఎక్కడ చూసినా గులాబీ జెండాలే... జై కేసీఆర్... జై వనమా నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, బంజారా నృత్యాలు దూం..దాంలతో గూడెం దద్దరిల్లింది. ఊరు వాడ తేడా లేకుండా సభకు కదిలారు ప్రజలు.. వేలాదిగా తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కొత్తగూడెం కోలాహలంగా మారింది. పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి కేసీఆర్ అదే తరహాలో ప్రజల్లో జోష్ నింపారు. సీఎం కేసీఆర్ ప్రసంగంవిన్న ప్రజలు వనమా గెలుపే లక్ష్యంగా ముందుకు కదిలారు. భారీ బహిరంగ సభ సక్సెస్ కావడంతో వనమా గెలుపు నల్లేరు పై నడికేనని పార్టీ శ్రేణులు నూతన ఉత్తేజంతో ముందుకు సాగుతున్నారు. మధుప్రియ మిత్ర బృందం నిర్వహించిన ధూంధాం సబికులను ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగిస్తున్నంతసేపు వనమా అభిమానులు, నాయకులు కార్యకర్తలు జై కేసీఆర్ జై వనమా అంటూ నినాదాలు చేశారు. సభకు వచ్చిన ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా 150 మంది వాలెంటీర్లతో రెండు లక్షల మజ్జిగ ప్యాకెట్లతో పాటు రెండు లక్షల మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేయించారు ఎమ్మెల్యే వనమా. అనుకున్న స్థాయి కంటే వేలాది సంఖ్యలో ప్రజలు సింగరేణి కార్మికులు కార్మిక కుటుంబాలు కార్యకర్తలు మనం అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సింగరేణి ప్రకాశం మైదానం కిక్కిరిసిన ప్రజానికంతో సీఎం సభ విజయవంతంగా ముగిసింది.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- నియోజకవర్గం అభ్యర్థి కారం పుల్లయ్య
- 8న నామినేషన్
- జయప్రదం చేయండి : మచ్చా



నవతెలంగాణ-చర్ల

భద్రాచలం శాసన సభ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీ చేస్తున్న కారం పుల్లయ్య గెలుపుకోసం ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్‌లు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం బీఎస్ రామయ్య భవన్‌లో మండలస్థాయి విస్తృత సమావేశం మండల కార్యదర్శి కారం నరేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గంలో గిరిజన, గిరిజనేతర ప్రజల అభివృద్ధి కోసం సీపీఐ(ఎం) పార్టీ అనేక పోరాటాలు చేసిందన్నారు. గత ఎమ్మెల్యేలుగా పని చేసిన కుంజా బొజ్జి, సున్నం రాజయ్యల వారసుడిగా సామాన్యుడు, విప్లవకారుడైన కారం పుల్లయ్య సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని అన్నారు. పేదలందరికీ ఇండ్లు ఇస్తామని చెప్పి బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చి ఇండ్లు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. విపరీతంగా ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపిందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య గెలిచిన తర్వాత నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. దళిత బందు, గృహలక్ష్మి పేరుతో కాంగ్రెస్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు పేదల వద్ద, దళితుల వద్ద లక్షల రూపాయలు దండుకున్నారని విమర్శించారు. పేదల డబ్బులు దోచుకునే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని అన్నారు. డబ్బు రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మాచారి మాట్లాడుతూ చర్ల మండలంలో భూమి లేని పేదలకు, గిరిజనులకు భూములు పంచి రైతులను చేసింది సీపీఐ(ఎం) పార్టీ అన్నారు. పోడుసాగుదారులకు హక్కు పత్రాల సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహించి పట్టాలు సాధించామని అన్నారు. మారుమూల ఆదివాసీ గ్రామాలకు రోడ్లు, విద్యుత్, లిఫ్టులు, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు పోరాడి సాధించారని తెలిపారు. పొదెం వీరయ్య గెలిచిన తర్వాత మండలానికి చేసిందేమీ లేదని విమర్శించారు. నవంబర్ 8వ తేదీన భద్రాచలంలో నామినేషన్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి కారం నరేష్, జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు, కొమరం కాంతారావు, తాళ్లూరి క్రిష్ణ, మండల కమిటీ సభ్యులు మచ్చ రామారావు, పొడుపుగంటి సమ్మక్క, తాటి నాగమణి, బందెల చంటి, దొడ్డి హరినాగవర్మ, శ్యామల వెంకట్, పామర్ బాలాజీ, శ్యామల నాగేశ్వరరావు, ఊకే రామకృష్ణ, సుబ్బంపేట సర్పంచ్ ఏక సుజాత, శ్రీను, వరదల వరలక్ష్మి, షారోని, పామర్ లక్ష్మి, సీతయ్య, భద్రకేళి, రాంబాబు, వెంకటేశ్వర్లు, తుర్రం గాందెమ్మ, పాయం వెంకటేశ్వర్లు, పాయం రమాదేవి, పాయం చంటి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల మాయ మాటలు నమ్మొద్దు

- బీఆర్ఎస్ సత్తుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య



నవతెలంగాణ-తల్లాడ

ఎన్నికలప్పుడే వచ్చి మాయ మాటలు చెప్పే కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ సత్తుపల్లి నియోగజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ఆదివారం తల్లాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సండ్ర మాట్లాడారు. నిత్యం ప్రజలతో మమేకమై ఒక కార్యకర్తలా పనిచేసిన నన్ను ప్రజలే గుర్తిస్తారన్నారు. నా బలగం బలం మీరేనన్నారు. గత మూడు పర్యాయాలుగా నన్ను గెలిపించి ఆదరించారు. అదేవిధంగా ఈ నెల 30న జరిగే ఎన్నికలలో అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తల్లాడ మండలంలో అనేక అభివృద్ధి పనులతో రోడ్లు, వంతెనలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మించామని, అభివృద్ధిని చూసి నన్ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి.శ్రీనివాసరావు, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ డి.భద్రరాజు, రెడ్డి వీర మోహన్‌రెడ్డి, వెంకట్ లాల్, బొడ్డు వెంకటేశ్వరరావు, మోదుగు ఆశీర్వాదం, దగ్గుల శ్రీనివాసరెడ్డి, బద్దం కోటిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు జివిఆర్, కో ఆప్షన్స్ సభ్యుడు షేక్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



మర్శకట్ల పెద్దశౌరి కుటుంబానికి సీపీఐ(ఎం) పరామర్శ

కల్లూరు : మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మర్శకట్ల పెద్ద శౌరి ఇటీవల మృతి చెందారు. ఆదివారం సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తాత భాస్కర్‌రావు శౌరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తాత భాస్కర్ రావు మాట్లాడుతూ పెద్దశౌరి సీపీఐ(ఎం) ఎనలేని సేవలను అందించారని, ఆయన లేని లోటు తీరనిదన్నారు. అనంతరం శౌరి కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి అంజయ్య , వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు మోదుగు వెంకయ్య ,తాళ్లూరు కార్యదర్శి నాయుడు చందర్రావు, వెంకటాపురం కార్యదర్శి సొంబత్తిని కృష్ణ, ప్రకాశం, మర్శకట్ల చిన్న దర్గయ్య మర్శకట్ల డేవిడ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటరమణ మోటార్స్ ఉమెన్స్ కార్ షోరూం ప్రారంభం



నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని టాటామోటార్స్ వారు తమ పాసింజర్ వెహికల్ విభాగంలో తమ అధీకత డీలర్ వెంకటరమణ మోటార్స్ ద్వారా ప్రెస్టేజియస్ మహిళా కార్ షోరూంని ఆదివారం డాక్టర్ బోడేపూడి శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుకు వస్తున్నారని, ఆటోమొబైల్ రంగంలో కూడా ఇంకా ముందుకు రావాలన్నారు. వెంకటరమణ మోటార్స్ వారు ఖమ్మంలో ఎక్సక్లూసివ్‌గా ప్రత్యేకంగా మహిళలతో ఈ టాటా కార్స్ షోరూంని ప్రారంభించడం అభినందనీయమన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇంటికి దీపం ఇల్లాలు ఎలాగో ఉద్యోగంలో కూడా అలాగే ఉండాలని, ఆలోచనతో వెంకటరమణ మోటార్స్ ఇండియా లో మొట్ట మొదటి ప్రెస్టేజియస్ మహిళా కార్ షోరూంని హైదరాబాద్‌లో ప్రారంభించామని, ఇప్పుడు మన ఖమ్మంలో రెండవ మహిళా ఎక్సక్లూసివ్ కార్ షోరూం ని మా వెంకటరమణ మోటార్స్ లాంచ్ చేస్తున్నదని చెప్పారు. ఈ షోరూం మహిళా ఉద్యోగులతో నడపబడుతుందని, సెక్యూరిటీ నుండి డ్రైవర్ వరకు అందరూ మహిళా మనులే ఉంటారని టెస్టుడ్రైవ్స్ కూడా నిపుణులైన మహిళా డ్రైవర్స్‌తో నడపబడుతుందని చెప్పారు.

ఈ టాటా కార్స్ మధ్యతరగతి కస్టమర్ నుండి విఐపి కస్టమర్స్‌కి అందుబాటులో ఉన్నాయని, వెంకటరమణ మోటార్స్ కస్టమర్ సర్వీస్ కోసం ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, కోదాడ, సూర్యాపేటలలో క్వాలిఫైడ్ టెక్నిషన్‌లతో నడపబడుతున్నదని, ప్రతి సర్వీస్ పాయింట్‌లో కస్టమర్ క్విక్ సర్వీస్ ఉన్నాదని, కస్టమర్ సంతృప్తి కోసం కంప్లైంట్ ఫీడ్ బ్యాక్ రిజిస్టర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ ఎక్సక్లూసివ్ మహిళా షోరూం లో మహిళలకు ప్రత్యేక డిస్కౌంట్, స్పెషల్ గిఫ్ట్ కూడా ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ చైర్మెన్ ద్రౌపతి మాట్లాడుతూ మహిళలు వాహనాలు ఎక్కువగా వాడుతున్నారని, వారి కోసం ఈ మహిళా షోరూం వెంకటరమణ మోటార్స్ ఎక్సక్లూజ్వ్ మహిళా షోరూం మన ఖమ్మంలో రావడం చాల ఆనందంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ మహిళా ఉద్యోగులు, కస్టమర్స్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు చేగొమ్మ విద్యార్థినీ

నవతెలంగాణ-కూసుమంచి

33వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని చేగొమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి కె.వర్ష ఎంపికైనట్టు ఆదివారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జిల్లాలోని కల్లూరు ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖోఖో అసోసియేషన్ సబ్ జూనియర్ కేటగిరిలో ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని పాఠశాల పిఈటి కవిత, ఉపాధ్యాయులు, అభినందించారు.



కేసీఆర్‌ను కలిసిన చందూ నాయక్

- అభినందించిన సీఎం
- అండగా నిలుస్తామని హామీ

నవతెలంగాణ-పాల్వంచ

పాల్వంచ మండల పెద్దమ్మ గుడి మాజీ ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ భుక్య చందు నాయక్ సీఎం కేసీఆర్‌ను కలిశారు. స్వయానా ఈయన జిల్లా జడ్పీ చైర్మెన్, మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య సొంత బామ్మర్ది. కోరం కనకయ్య ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయినా చందు నాయక్ బావతో వెళ్లకుండా ఆదివారం కొత్తగూడెంలోని ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన సీఎం కేసీఆర్ కొత్తగూడెం ఇన్‌చార్జ్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చందునాయక్‌ను ముఖ్యమంత్రితో పరిచయం చేయడంతో కేసీఆర్ చందు నాయక్‌ను అభినందించారు. మీకు అండగా నిలుస్తామని హామీ ఇస్తూ ఉమ్మడి జిల్లా నాయకులకు బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని చెప్పారు.

9న తమ్మినేని నామినేషన్‌కు భారీగా తరలిరావాలి



నవతెలంగాణ-తిరుమలాయపాలెం

ఈనెల 9న సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని వీరభద్రం నామినేషన్‌కు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని మండల కార్యదర్శి కొమ్ము శీను పిలుపునిచ్చారు. ఆదివారం తిరుమలాయపాలెం మండలంలో బచ్చోడు గ్రామంలో జోన్ ముఖ్య కార్యకర్తల సమావేశం బింగి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ్మినేని వీరభద్రం చిన్నతనం నుంచి ఇప్పటివరకు అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర తమ్మినేని కుందని, దుమ్ముగూడెం ప్రాజెక్టు కావాలని మహాప్రస్థానం పాదయాత్ర చేసి దళిత వాడల అభివృద్ధి కోసం కెవిపిఎస్ సైకిల్ యాత్ర ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించి ప్రజల కోసం తన జీవితాన్నే అంకితం చేసిన వీరభద్రం నామినేషన్‌కు పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామములో డోర్ టు డోర్ ప్రచార నిర్మించి నామినేషన్‌కు తరలిరావాలని, సుత్తి కుల నక్షత్రం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బింగి రమేష్, గుండుమల ఉపేందర్, నాగటి సురేష్, పల్లి రమేష్, మోటపోతుల శ్రీను, అంగిరేకుల శ్రీహరి, సనాతన చారి, సత్యనారాయణ చారి, వెంకన్న, అన్న బత్తుల సత్తిబా, అరవయ్య తదితరులు పాల్గొన్నారు.

10న సీపీఐ(ఎం) మధిర అభ్యర్థి నామినేషన్

నవతెలంగాణ-ముదిగొండ

ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోటీలో మధిర నియోజకవర్గం సిపిఐ (ఎం) అభ్యర్థి పాలడుగు భాస్కర్ ఈనెల 10న మధిరలో నామినేషన్ వేయనున్నట్లు సిపిఐ(ఎం)మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. ఈ నామినేషన్ ర్యాలీ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుండి పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభ్యుదయ ప్రజాతంత్ర శక్తులు, సానుభూతిపరులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అన్నతో ప్రాణహాని ఉంది రక్షణ కల్పించండి

- అన్న దగ్గర నుండి రావాల్సిన డబ్బులను ఇప్పించండి
- బాధితుడు గంజాయి మారయ్య

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

తన అన్నతో తనకు ప్రాణహానీ ఉందని, రక్షణ కల్పించాలని బాధితుడు గంజాయి మారయ్య కోరారు. ఆదివారం ఖమ్మం నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం బాధితుడు ముదిగొండ మండలం, వెంకటగిరి గ్రామం జంగాల కులానికి చెందిన గంజాయి మారయ్య వివరాలు వెల్లడించారు. తన భార్య అయిన గంజాయి రమాదేవిని అక్క మొగుడు మాయ మాటలు చెప్పి లోబడుచుకుని



శరీరకంగా వాడుకొని అనుమానంతో వేధింపులకు గురి చేయగా మనస్థాపనతో 14-08-2022న చనిపోయింది. ఆ తర్వాత ఈ పంచాయతీ కుల పెద్దల దృష్టికి పోగా కుల పెద్దలు తన భార్య చనిపోవడానికి కారణమైన రేగల రమేష్ దగ్గర నుండి ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ పిల్లగాడు చిన్న పిల్లల జీవితం ఆగమైంది. కాబట్టి నష్టపరిహారంగా 20 లక్షల రూపాయలను ఇప్పించారు. అదనంగా రెండు లక్షల రూపాయల కూడా ఇచ్చారని విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. తను బాధల్లో ఉండటంవల్ల డబ్బులను మా అన్న గంజాయి వీరన్నకు అందజేశారు. ఆ డబ్బులను తన ముగ్గురు పిల్లల పేరు మీద బ్యాంకులో డిపాజిట్ చేయమంటే చేయకుండా డబ్బు మీద ఆశతో వేధింపులకు గురి చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.మా అన్న దగ్గర నుండి రావాల్సిన డబ్బులను ఇప్పించవలసిందిగా కుల పెద్దలను కోరారు. అలాగే మా అన్న తో మాకు ప్రాణహాని ఉందని కావున నాకు, నా పిల్లలకు, నా తల్లికి రక్షణ కల్పించాలని పోలీసు వారిని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బాధితుడు తల్లి గంజాయి మంగమ్మ, పిల్లలు పాల్గొన్నారు.

బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

నవతెలంగాణ-బోనకల్

బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించే వైద్యసేవలు అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు అన్నారు. మండల కేంద్రంలోని మేఘశ్రీ హాస్పటల్స్‌లో ప్రతి నెల మొదటి ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం నిర్వహించే బిపి, షుగర్, కంటి ప్రత్యేక క్యాంపు విజయవంతంగా ఆదివారం ముగిసింది. ఈ క్యాంపుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ సిపిఐ నాయకులు అమరజీవి తూము ప్రకాశరావు పేదలకు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన ప్రాణాన్ని సైతం అర్పించారన్నారు. ప్రకాశరావు కుటుంబీకులు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సానుభూతి పరులు ఆయన ఆశయాలను కొనసాగించడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా బిపీ, షుగర్ ను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ బిపి, షుగర్ ప్రత్యేక క్యాంపును నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన



వైద్యసేవలందించడం అభినందనీయమన్నారు. క్యాంపులో ప్రముఖ జనరల్ వైద్య నిపుణులు టి. పవన్ కుమార్, డి.సాయికుమార్‌లు వైద్యసేవలు అందించారు. కంటి వైద్యులు సూతగాని శ్రీకాంత్ కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. అనంతరం క్యాంపులో 100 మంది పేషంట్లకు బెజవాడ రవిబాబు, ఆర్ఎంపీడబ్ల్యూఏ టీఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఏలూరి పూర్ణచంద్, క్యాంపు నిర్వాహకులు ఆకెన పవన్, సాధనపల్లి ఆమర్నాథ్, క్యాంపు సహాయకులు యంగల గిరి, రాజేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు పట్టణ అధ్యక్షుడిగా కందికొండ

నవతెలంగాణ-నేలకొండపల్లి



మున్నూరు కాపు సంఘం నేలకొండపల్లి పట్టణ అధ్యక్షుడిగా కందికొండ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నేలకొండపల్లి పట్టణ మున్నూరు కాపు సంఘం సమావేశం స్థానిక గౌతమి పాఠశాలలో సాగి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మారిశెట్టి వెంకటేశ్వరరావు, కనపర్తి నాగేంద్రరావు, ఆకుల వెంకయ్య, మానుకొండ దుర్గారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్నూరు కాపులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. మున్నూరు కాపులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని తద్వారా సమాజాభివృద్ధిలో కీలక భూమిక పోషించాలన్నారు. రానున్న కాలంలో మున్నూరు కాపు సంఘాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. అనంతరం నేలకొండపల్లి పట్టణ మున్నూరుకాపు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా గుండా బ్రహ్మం, ప్రధాన కార్యదర్శిగా బ్రమ్మారపు ఉదయ్ భాస్కర్, సహాయ కార్యదర్శిగా తోట నరసింహారావు, కమిటీ సభ్యులుగా ఏనుగుల శ్రీను, చిట్టెంశెట్టి వెంకటేశ్వర్లు, కందికొండ సాయివితేష్, చిట్టెంశెట్టి ఉదయ్ భాస్కర్. ట్రెజరీగా తోట భాను, యూత్ పట్టణ అధ్యక్షుడుగా మద్రి శివలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో బాజా నాగేశ్వరరావు, కందికొండ శ్రీను, తోట శ్రీను, చిట్టెంశెట్టి రాంబాబు, బాజా రామకృష్ణ, చెన్నంశెట్టి రాంబాబు, జంగిలి శ్రీను, బాజా నాగభూషణం, జంగిలి శేఖర్, కనపర్తి నాగేశ్వరరావు, నున్నా నరసింహారావు, మిట్టపల్లి వెంకటరమణ, ముళ్ళంగి వెంకటేష్, పసుపులేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధిష్టానం నిర్ణయమే శిరోధార్యంగా పని చేయాలి

- పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్

నవతెలంగాణ-నేలకొండపల్లి

ఈ నెల 30న జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం రాష్ట్ర అధిష్టాన నిర్ణయమే శిరోధార్యంగా పార్టీ శ్రేణులు కట్టుబడి పని చేయాలని ఆ పార్టీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీ సీతారామ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల అభిప్రాయాలను సేకరించి రాష్ట్ర పార్టీకి తెలిపుతారని చెప్పారు. తద్వారా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిర్వహించాల్సిన పాత్రను రాష్ట్ర పార్టీ నిర్ణయించడం జరుగుతుందన్నారు. అప్పటివరకు గ్రామీణ ప్రాంతాలలో పార్టీ శ్రేణులు సమయమనం పాటించాలని, పూర్వ వైభవం దిశగా పార్టీ ఆదేశానుసారం సమన్వయంతో ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆరెకట్ల కొండలరావు, నాయకులు నల్లమాసు మల్లయ్య, సూరపనేని రామకృష్ణ, నూక హనుమంతరావు, పావులూరి వెంకటేశ్వరరావు, తలసీల గోపాలరావు, తాటికొండ నాగేశ్వరరావు, కుక్కల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండలంలోని ఏదులాపురం పంచాయతీ పరిధిలోగల సత్యనారాయణపురం గ్రామానికి చెందిన అనుముల ప్రేమలతకు మంజూరైన రూ.12 వేలు, పెద్దతండ పంచాయతీ పరిధిలోని నాయుడుపేట(ఇందిరమ్మ కాలనీ)కు చెందిన కందిపాటి సరితకు మంజూరైన 19,500 రూపాయల చెక్కులను సీపీఐ(ఎం)



జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫారసు ద్వారా సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఉరడీ సుదర్శన్‌రెడ్డి సహకారంతో చెక్కులు మంజూరైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, నాయకులు తోట పెద్ద వెంకటరెడ్డి, నందిగామ కృష్ణ, ఏటుకూరి ప్రసాదరావు, పుల్లయ్య, వెంకన్న, నరేష్‌రెడ్డి, వీరబాబు, గోవిందరావు, హనుమంతరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-మధిర

పదోన్నతిపై పీజీ హెచ్ఎంగా భూపాలపల్లి బదిలీలలో వెళ్ళిన పద్మావతిని, స్కూల్ అసిస్టెంట్ సోషల్ నాగూర్ వలీ, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ వెంకటేశ్వరావుని జెడ్పీహెచ్ఎస్ మడుపల్లిలో ప్రధానోపాధ్యాయులు సాధు సమాధానం ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి. నరసింహారావు, భూసా. కోటేశ్వరరావు, ఆదాము, బాబురావు, యెహెూషువ, ఎస్.రామిరెడ్డి, పి.కిషోర్, కృష్ణయ్య జ్యోతిర్మయి, రాణి, బి.చైతన్య, చిట్టిబాబు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-నేలకొండపల్లి

ఈనెల 6 వ తేదీ నుండి ముదిగొండ మండలంలోని సువర్ణాపురం - లక్ష్మీపురంలోని ఉషశ్రీ కాటన్ అండ్ జిన్నింగ్ మిల్‌లో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఒక ప్రకటనలో తెలియజేశారు. కనీస మద్దతు ధర క్వింటాకి రూ.7020 చెల్లించడం జరుగుతుందన్నారు. తేమ శాతము 8 నుండి 12 వరకు ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకము, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను వెంట తెచ్చుకోవాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని, మర్లపాడు తెలగవరం గ్రామానికి చెందిన పలువురి యువకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో సత్తుపల్లి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాచినేని శంకర్ రావు, జమ్ముల నారాయణ రావు, దొబ్బుల శ్రీనివాస్‌రావు, యలమందల రంజిత్, యలమందల మురళి ఆధ్వర్యంలో చేరగా జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ కాంగ్రెస్ కండవలు కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

డిజిటల్ మీడియాను ఆదరించండి

- చలమాల నరసింహారావు
- డీఏమ్ఏ నియోజకవర్గ అధ్యక్షులుగా మల్లూరు

నవతెలంగాణ-పెనుబల్లి

ఆధునిక సమాజంలో జరుగుతున్న వార్తలను ఎప్పటికప్పుడు కళ్ళకు కట్టినట్లుగా చూపించే డిజిటల్ మీడియాను ఆదరించాలని చలమాల నరసింహారావు ప్రజా సంఘాలను కోరారు. మండల పరిధిలోని వి ఏమ్ బంజర పట్టణంలో గల లక్ష్య పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన నియోజకవర్గ డిజిటల్ మీడియా రిపోర్టర్స్ సమావేశంలో చలమాల మాట్లాడారు.

ప్రగతిశీల భావాలతో కూడిన డిజిటల్ మీడియా అసోసియేషన్(డి.ఏమ్.ఏ.)ఏర్పాటు చేసుకోవడం శుభదాయకమన్నారు. అనంతరం నియోజకవర్గ డి ఏమ్ఏ అధ్యక్షులుగా మల్లూరు చంద్రశేఖర్‌ను, ప్రధాన కార్యదర్శిగా బెజవాడ సాయి శేషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా చలమాల నరసింహారావును, గౌరవ సలహాదారులుగా రిటైర్డ్ టీచర్ గోపిశెట్టి వెంకటేశ్వరరావును, కోశాధికారిగా ఏమ్‌డి.అఫ్జల్, సహాయ కార్యదర్శిగా తాళ్లూరి వెంకట కౌశిక్, ఉపాధ్యక్షులుగా జిక్కుల తరుణ్, చక్కి లాల వంశీలను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన అధ్యక్షులు మల్లూరును విశ్రాంత ఉపాధ్యాయులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, మీడియా రిపోర్టర్స్ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా గోపి శెట్టి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న నిజాన్ని నిర్భయంగా ప్రసారం చేయాలని, ఫోర్త్ ఎస్టేట్ విలువలు ,కీర్తి ప్రతిష్టలను పెంచే దిశగా డిఏమ్ఏ పని చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై ఆర్ఎంపిలకు అవగాహన

నవతెలంగాణ-కామేపల్లి

ప్రస్తుత సీజనల్ వ్యాధులపై మండలంలోని గ్రామీణ వైద్యులకు ఖమ్మం పట్టణంలోని సీటీ హస్పిటల్ డయాలసిస్ సెంటర్ వైద్యులు డాక్టర్ రాజ్ కూమార్ ఎండీ, డాక్టర్ సతీష్ కూమార్ ఎంఎస్ జనరల్ సర్జన్‌లు అవగాహన కల్పించారు. ఆదివారం నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం సీటీ హస్పిటల్ చైర్మెన్ డాక్టర్ కరీం మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో అతీతక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సహయక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బందెల నాగేశ్వరరావు, మైబూరెడ్డి జిల్లా నాయకులు అమ్రుతరావు, రమేష్, సుందర్ రావు, అప్పారావు, ఆర్.రాధాకృష్ణ, శ్రీనివాస్, కోటేశ్వరరావు, ఇమామ్ రాము తదితరులు పాల్గొన్నారు.

తూము వెంకటేశ్వరరావుకు నివాళులు

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం సిరిపురం గ్రామంలో మాజీ జడ్పీటీసీ తూము వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మరణించారు. ఆదివారం వైరా నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బాణోత్ మదన్ లాల్ ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో దిశ కమిటీ సభ్యులు కట్టా క్రిష్ణార్జునరావు, వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ పసుపులేటి మోహన్‌రావు, వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ ముళ్ళపాటి సీతరాములు, కొత్తా వెంకటేశ్వరరావు, మెరంపుడి బాబు, మెరంపుడి ప్రజా, కామినేని శ్రీనివారావు తదితరులు ఉన్నారు.

పయ్యావుల పుల్లయ్యకు సీపీఐ(ఎం) నివాళి

ముదిగొండ : మండలపరిధిలో గోకినేపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) నాయకులు, అమరజివి, గ్రామపంచాయతీ పంపు ఆపరేటర్ పయ్యావుల పుల్లయ్య ప్రథమ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య చిత్రపటానికి సీపీఐ(ఎం) నాయకులు పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పుల్లయ్య మృతికి సంతాపన్న వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, చింతకాని మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు వత్సవాయి జానకిరాములు, కందుల భాస్కరరావు, వేల్పుల భద్రయ్య, పయ్యావుల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలోనే ప్రగతి పథంలో పల్లెలు

- పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ మ్యానిఫెస్టో
- ఆశీర్వదించండి... సైనికుడిలా పనిచేస్తా
- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు



నవతెలంగాణ-బూర్గంపాడు

స్వరాష్ట్రంలోనే ప్రగతి పథంలో పల్లెలు వున్నాయని, పేదల సంక్షేమానికి బిఆర్ఎస్ మ్యానిఫెస్టో వుందని, ఆశీర్వదించండి.. సైనికుడిలా పనిచేస్తానని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ఆకర్షితులై టేకుల చెరువు గ్రామానికి చెందిన సుమారు 40 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరిక గులాబీ కండువాలు కప్పి పార్టీ లోకి రేగా కాంతారావు ఆహ్వానించారు. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో రేగా కాంతారావు సమక్షంలో అభివృద్ధి సంక్షేమ పథ కాలు ఆకర్షి తులై కాంగ్రెస్ పార్టీ నుంచి టేకుల చెరువు గ్రామానికి చెందిన సుమారు 40 కుటుం బాలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు గులాబీ జెండా అండగా ఉంటుందని ఆయన అన్నారు. సామాన్యులకు మేలు జరిగే విధంగా సీఎం కేసీఆర్ బిఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో రూపొందించారని ఆయన అన్నారు. రాష్ట్రం ప్రజా సంక్షేమ దిశగా ప్రయాణిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఆసరా పెన్షన్ అర్హులైన మహిళలకు సౌభాగ్య లక్ష్మి పథకం కింద 3000 అందిస్తారని ఆయన తెలిపారు. అలాగే వచ్చే ఏడాది మీ నుంచి పేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు. రైతు బీమా రైతు బంధు వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్‌తో పాటు వ్యవసాయాన్ని పండుగ మారిందని, పంట దిగుబడులు పెరిగాయని ఆయన అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలి పించాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ అధ్యక్షులు బిక్కసాని శ్రీనివాసరావు, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పార్టీ మండల నాయకులు పాండవుల దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కోవర్ట్‌ల వ్యవహరించిన కాసాని జ్ఞానేశ్వర్

- అధిష్టానం నిర్ణయం మేరకు ముందుకు పోతాం
- టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు

నవతెలంగాణ-బూర్గంపాడు



కాసాని జ్ఞానేశ్వర్ ఒక రాజకీయ పార్టీకి కోవర్ట్‌లా వ్యవహరించారని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. బూర్గంపాడు మండలం సారపాకలో తెలుగుదేశం పార్టీ ఐటీసీ టీఎన్టీయుసీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా ఎంతో నమ్మకంతో బీసీ నాయకుడు అని పార్టీ అధ్యక్ష బాధ్యతలు కాసాని జ్ఞానేశ్వర్‌కు అప్పగిస్తే నమ్మకద్రోహం చేశారని ఆయన ఆరోపించారు. పార్టీని బలహీన పరిచే విధంగా పని చేశారన్నారు. కాసానికి జ్ఞానేశ్వర్ అధ్యక్షుడు అయిన తొలి రోజునుండి ఒక పార్టీకి కోవర్ట్‌గా పనిచేసి పార్టీని తీవ్రంగా దెబ్బతీశారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక నియోజక వర్గాల్లో పటిష్టంగా ఉన్న పార్టీని ఈ రోజు పోటీ చెయ్యని పరిస్థితికి తీసుకు వచ్చింది జ్ఞానేశ్వర్ అని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో ఒక నాయకుడు సొంత ఖర్చుతో ప్రతిష్టాత్మకమైన సభా ఏర్పాటు చేస్తే జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం అభిమానులు స్వతహాగా సొంత ఖర్చులతోటి సభకు విచ్చేసి విజయవంతం చేశారని, అది తొలి మెట్టుగా రాష్ట్రం మొత్తం సభలు నిర్వహిస్తామని తెలియ జేసి మిగిలిన జిల్లాల్లో సభలో నిర్వహించకుండా పార్టీని బల హీనపరిచే చర్యలు చేపట్టారని ఆయన విమర్శించారు. తనకి ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారాల గురించి ప్రభుత్వంపై ఎటువంటి విమర్శలు చేయకుండా, ఇతర తెలుగుదేశం నాయకులు కూడా విమర్శలు చేయనీయకుండా చేసి పార్టీని నిర్వీర్యం చేయాలని చూశారన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకొని చంద్రబాబు నాయుడును విమర్శించడం ఆయన దివాలా కోరుతనానికి నిదర్శనమని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రస్తుతం పినపాక నియోజకవర్గంలో బలంగా ఉన్న తెలుగుదేశం పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తాళ్ళూరి జగదీశ్వర రావు, ఐటీసీ టీఎన్టియుసి అధ్యక్షులు కనక మేడల హరిప్రసాద్, గల్లా నాగభూషయ్య, కాకర్ల సత్యనా రాయణ, నెట్టెం భాస్కర్, జీవన్ రెడ్డి, కుందేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న బీఎస్పీ అభ్యర్థి కామేష్

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం నియోజకవర్గ బీఎస్పీ అసెంబ్లీ అభ్యర్థి, ప్రముఖ న్యాయవాది యెర్రా కామేష్ ఆదివారం కొత్తగూడెంలోని పలు చర్చిలకు వెళ్లి చర్చి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. చర్చి ఫాదర్‌ల ఆశీర్వాదం తీసుకున్నారు. బీఎస్పీ పార్టీ కులాలకు, మతాలకు అతీతమైందని చాటి చెప్పేందుకే ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. గతంలో మణిపూర్‌లో జరిగిన అల్లర్లకు నిరసనగా క్రిస్టియన్ మైనార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా బీఎస్పీ పార్టీ తరఫున సంఘీభావం తెలపడమే కాకుండా నిరసన ర్యాలీలో సైతం పాల్గొన్నారని తెలిపారు. శనివారం నామినేషన్ వేసిన అనంతరం సండే ప్రధాన చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేయడంతో పాటు చర్చి ఫాదర్ ఫిలిప్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయి, జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్ రావు, సందేల సందీప్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పాఠశాలల స్విమ్మింగ్ ఎంపికలు

నవతెలంగాణ-కొత్తగూడెం

ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్-14, అండర్-17 బాలబాలికల స్విమ్మింగ్ ఎంపికలు నవంబర్ 6వ తేదీన , కొత్తగూడెం సింగరేణి సిఇఆర్ క్లబ్, కొత్తగూడెం నందు నిర్వహించనున్నరని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలలో పాల్గొనే ఆసక్తి గల అండర్-14, అండర్-17 స్విమ్మింగ్ క్రీడాకారులు 6వ తారీఖు ఉదయం 9 గంటలకు కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియం ఎదుట ఉన్న సింగరేణి సీఇఆర్ క్లబ్‌లో హజరు కావాలని కోరారు. ఈ పోటీల్లో పాల్గొనే అండర్ 17 క్రీడాకారులు ఈ విద్యా సంవత్సరం 6వ తరగతి నుండి ఇంటర్ ఫస్టియర్ చదువుతూ 1జనవరి 2007 తర్వాత జన్మించిన వారై ఉండాలని, 9,10వ తరగతిలో చదువుతున్న వారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ద్వారా స్టడీ సర్టిఫికెట్. ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని చెప్పారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 10వ తరగతి ఇంటర్నెట్ మెమో డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపాల్ చేత సంతకం చేయించుకుని. కళాశాల బోనఫైడు, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని హాజరు కావలెను. అండర్-14 క్రీడాకారులు 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతూ 1జనవరి 2010 తరువాత జన్మించిన వారు అర్హులని చెప్పారు. పేర్కొన్న ధృవీకరణ పత్రాలు తీసుకొని రాని వారిని ఎట్టి పరిస్థితులలోనూ ఎంపికలకు అనుమతించబడరని ఉమ్మడి ఖమ్మం జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శులు కె.నర్సింహామూర్తి, స్టెల్లా ప్రేమ్‌కుమార్‌లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్నటువంటి వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ దర్శకులు. అందరు కూడాను ఈ నియమ నిబంధను పాటిస్తూ క్రీడాకారులు హాజరు అయ్యేలా చూడాలని కోరారు.

చికిత్స పొందుతూ గిరిజన వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

క్రిమి సంహారక మందు గత శుక్రవారం బలవన్మరణానికి యత్నించిన వ్యక్తి కొత్తగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో ఆదివారం వేకువజామున మృతి చెందినట్లు స్థానిక ఎస్సై ఈ.రతీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాఘవాపురం గ్రామం అవివాహితుడైన గొగ్గెల చంద్రశేఖర్ (25) లారీ క్లీనర్‌గా పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 3వ తేదీన తల్లి మల్లమ్మ మందలించారని మనస్థాపానికి గురై క్రిమి సంహారక మందు తాగాడు. తాగిన విషయం కుటుంబ సభ్యులకు చెప్పడంతో తొలుత ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ మూడు రోజులుగా చికిత్స పొందుతున్న చంద్రశేఖర్ ఆరోగ్యం విషమించడంతో ఆదివారం వేకువజామున మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రతీష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, కొత్తగూడెంలోనే పోస్ట్ మార్టం నిర్వహించి, అంత్యక్రియల నిమిత్తం చంద్రశేఖర్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఎస్సై అప్పగించారు. కాగా, నలుగురు సంతానంలో 2వ కుమారుడు ఇలా క్షణికావేశంలో బలవన్మరణం చెందడంతో తల్లి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఉప సర్పంచులు

నవతెలంగాణ-ఇల్లందు



ఇల్లందు మండలంలోనీ ఇందిరానగర్, బాలాజీ నగర్ గ్రామ పంచాయతీకి చెందిన ఉప సర్పంచులు వల్లాల రంజిత్, వల్లపు ఎల్లయ్యలు ఇల్లందు పట్టణంలో గల జెడ్పీ చైర్మెన్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మెన్ కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పులి సైదులు, ప్రధాన కార్యదర్శి అరెం కిరణ్, సర్పంచులు పాయం లలిత, పాయం స్వాతి, కల్తీ పద్మ, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, పాల్గొన్నారు.



చేసిన కష్టం తీరాలంటే చేతి గుర్తుకు ఓటెయ్యిండి

- పాయం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నవతెలంగాణ-పినపాక

చేసిన కష్టం తీరాలంటే చేతి గుర్తుకే ఓటేయాలని పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పినపాక మండలంలో ఆయన విస్తతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ముందుగా దుగినేపల్లి గ్రామం చేరుకొని పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. దుగినేపల్లి గ్రామం నుండి ఈ బయ్యారం క్రాస్ రోడ్ వరకు పాయంతో కలిసి ఆయన అభిమానులు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. దుగినేపల్లి , చెగార్శల, జానంపేట గ్రామాల్లో భారీ సంఖ్యలో వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశారని ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటే కనీసం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకపోగా ఇచ్చిన ఒకటి రెండు నోటిఫికేషన్ ఉద్యోగాలను అమ్ముకున్న ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోలిపోయిన శ్రీవాణి, కాటబోయిన నాగేశ్వరరావు, ఉడుముల లక్ష్మారెడ్డి, ఉడుముల రవీందర్ రెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన మడోన్నా విద్యార్థులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో గల మడోన్నా పాఠశాల విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్‌లో మడోన్నా పాఠశాలకు చెందిన 23మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. కరాటే శిక్షకులు ముత్తు శిక్షణలో ఈ విద్యార్థులంతా మెరికల్లాంటి ప్రతిభతో సామర్థ్యాలను ప్రదర్శించగలిగారు. కాగా నలుగురు విద్యార్థులకు బంగారు పతకాలు, ఏడుగురు విద్యార్థులు గ్రాంజ్ పతకాలు, 13మంది విద్యార్థులకు సిల్వర్ పతకాలతో పాటు ముగ్గురు విద్యార్థులకు బ్లూ బెల్టులు దక్కాయి. ఈ కార్యక్రమానికి ఈ ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ నటుడు సుమన్ మడోన్నా విద్యార్థులతో పాటు శిక్షకులు ముత్తును ప్రత్యేకించి అభినందించారు. విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చినందుకు గానూ పాఠశాల కరస్పాండెంట్ చక్రధర్, రూపారాణిలు విద్యార్థులను ప్రత్యేకించి అభినందించారు.

ప్రసాద్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 30 కుటుంబాల వారు కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ నాయకులు చావా శివ రామకృష్ణ ఆధ్వర్యంలో సాయి గణేష్ నగర్‌లోని పాలేరు నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని, పాలేరులో మీ శీనన్నను అధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు అంతా సహకరించాలని కోరారు. కాంగ్రెస్ చేరిన వారిలో దూదిమెట్ల వెంకట్, షేక్ యాకుబ్ అలీ, నజీర్, జైలా, జానీ, పాషా, మైబూ, నాగుల్ మీరా, పండూ ఉన్నారు.

మద్యం సీసాలు రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-జూలూరుపాడు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ కొత్తగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ సూపర్ ఇంటెండెంట్ శాఖ ఆదేశాల మేరకు ఎలక్షన్ కోడ్ మీరీ మద్యం సీసాలు రవాణా చేస్తున్న గుండేపూడి గ్రామ నివాసి అయిన లావుడ్య రమేష్‌ను అదుపులోనికి తీసుకుని అతని వద్ద నుంచి 15 మద్యం సీసాలు, ఒక టూ వీలర్‌ను స్వాదీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌ఓ జయ శ్రీ తెలిపారు. ఈ దాడులలో ఎస్సై సాయి కుమార్, హెచ్ సి. ప్రకాష్ రావు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.